

RNI Number TELTEL/2023/85680

# మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం



రిపోర్టర్లు కావలెను

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

మన దునియా

ఇంకెందుకు ఆలస్యం...
9490056011,9603969335



సంపుటి : 3 | సంచిక : 356 | ఆగస్టు 27 గురువారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


# తెలంగాణ సమీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

**తెలంగాణ సమీక్షకు అధికారులకు కీలక ఆదేశాలు**

**పెండింగ్ అంశాలపై సమగ్రంగా సమీక్షించాలని సూచన**

**అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలి**

**అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ**

**హైదరాబాద్,ఆగస్ట్26:**

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026-ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణలో భాగంగా ప్రజాభవన్‌లో తక్షణమే ప్రత్యేక వార్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. బుధవారం ప్రజాభవన్ లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. సీనియర్ అధికారి ఆధ్వర్యంలో ఈ వార్ రూమ్ పర్యవేక్షణ బాధ్యతలను సీఎస్ పటిష్టం చేయాలని సూచించారు. సమ్మిట్ కోసం ఏర్పాటు చేసిన వివిధ కమిటీలలో అవసరమైన నిపుణులను కీలక అధికారులను తీసుకోవలని ఆయన చెప్పారు. గతంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా

(మిగతా 2వ పేజీలో..)





# నేపాల్‌లో వరద బీభత్సం.. 95 మంది మృతి



**టిబెట్ నుంచి ఒక్కసారిగా దూసుకొచ్చిన వరద**

**403 మంది గల్లంతు.. 133 మంది భారతీయులు**

**కొట్టుకుపోయిన ఇళ్లు, రహదారులు, వంతెనలు**

**సహాయక చర్యల్లో నేపాల్, భారత్, చైనా బృందాలు**

**కాఠ్మాండు, ఆగస్టు 26:**

నేపాల్‌లో భారీ వరద బీభత్సం సృష్టించింది. చైనా ఆక్రమిత టిబెట్ సరిహద్దులోని భోటెకోషి నదిలో బుధవారం ఉదయం ఒక్కసారిగా వచ్చిన వరదతో రసువా జిల్లాలోని పలు ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వరద ప్రవాహం ఇళ్లు, రహదారులు, వంతెనలు, మార్కెట్లు, విద్యుత్ మౌలిక వసతులను కొట్టుకుపోయింది. రసువా జిల్లాలోని టిమురే, స్యాఫ్రుబేసి ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. వరద నీరు భోటెకోషి నుంచి త్రిశూలి నదిలోకి ప్రవహించడంతో దిగువ ప్రాంతాల్లోనూ అప్రమత్తత ప్రకటించారు.

95 మంది మృతి.. 403 మంది గల్లంతు

నేపాల్ పోలీసుల తాజా సమాచారం ప్రకారం ఇప్పటివరకు 95 మంది మృతదేహాలను

(మిగతా 2వ పేజీలో..)

# గ్రేటర్ హైదరాబాద్‌లో ఒకే రోజు 17 అక్రమ కట్టడాల కూల్చివేత

**అంజయ్యనగర్ ఘటనతో మేల్కొన్న ప్రభుత్వం**

**అక్రమ నిర్మాణాలపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం**

**భవన ప్రమాదం కేసులో కాంట్రాక్టర్ మహ్మద్ ఖాజామియా అరెస్ట్**

**అనుమతులు లేని నిర్మాణాలను నోటీసులు లేకుండా కూల్చేయాలని నిర్ణయం**

హైదరాబాద్‌లోని అంజయ్యనగర్‌లో

(మిగతా 2వ పేజీలో..)



# కేసీఆర్ పాలన ప్రజా సంక్షేమంగా సాగితే.. రేవంత్ పాలన భూముల వ్యాపారంగా సాగుతోంది: హరీశ్ రావు

**కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాల వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోందన్న హరీశ్**

**పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే అక్కడ భూములను అమ్మేస్తున్నారని ఆరోపణ**

**లక్షల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కొంటున్నారని మండిపాటు**

నాడు కేసీఆర్ పాలన ప్రజా సంక్షేమ కేంద్రంగా సాగితే, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి పాలన భూముల వ్యాపారం కేంద్రంగా నడుస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రస్థాయిలో



విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఈరోజు ఏర్పాటు చేసిన 22ఏ బాధితుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

(మిగతా 2వ పేజీలో..)

# నేపాల్‌లో జల విలయం.. ప్రధాని బాలేన్ షాతో మాట్లాడిన మోదీ

**నేపాల్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు**

**105 మంది భారతీయులు సహా 384 మంది పర్యాటకులు గల్లంతు**

**సహాయక చర్యలు ముమ్మరం**

**నేపాల్ ప్రధానితో ఫోన్ లో మాట్లాడిన మోదీ, సాయానికి సిద్ధమని ప్రకటన**

పొరుగు దేశం నేపాల్‌ను భారీ వరదలు ముంచెత్తాయి. రసువా ప్రాంతంలోని భోటే కోశీ

(మిగతా 2వ పేజీలో..)



# ఇందిరమ్మ ఇళ్లకు లక్కీ డ్రా.. 28 నుంచి ఫ్లాట్ల కేటాయింపు

**హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల టవర్స్‌కు లక్కీ డ్రా**

**మొత్తం 40,900 మందిని అర్హులుగా గుర్తించిన ప్రభుత్వం**

**మరో నాలుగు నియోజకవర్గాల్లో కొత్తగా ఇళ్ల నిర్మాణం**

**టెండర్ల ప్రక్రియ పూర్తయిందని వెల్లడించిన మంత్రి పొంగులేటి**

హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో పేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నెల 28 నుంచి 31 వరకు అర్హులైన దరఖాస్తుదారుల సమక్షంలోనే లక్కీ డ్రా ద్వారా ఫ్లాట్లను కేటాయించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. మంగళవారం

(మిగతా 4వ పేజీలో..)



# కోదాడలో బస్సు ప్రమాదం.. స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన మంత్రి**

**ప్రమాదంలో ఐదుగురు మహిళలతో సహా ఆరుగురు మృతి**

**హైదరాబాద్ నుంచి ఏలూరు వెళుతుండగా తెల్లవారుజామున ఘటన**

సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వారకుంట వద్ద ప్రైవేటు బస్సు ప్రమాదానికి గురైన ఘటనపై




(మిగతా 4వ పేజీలో..)

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# ఇందిరమ్మ ఇళ్లకు లక్కీ డ్రా..

## 28 నుంచి ఫ్లాట్ల కేటాయింపు

(మొదటి పేజీ తరువాయి)

సచివాలయంలో హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష అనంతరం ఆయన వివరాలు వెల్లడించారు. తొలి విడతలో 15 నియోజకవర్గాల్లో రూ. 807.40 కోట్ల అంచనా వ్యయంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని, దీనికి సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయిందని మంత్రి తెలిపారు. మొత్తం 60,720 దరఖాస్తులు రాగా, క్షుణ్ణంగా పరిశీలించి 40,900 మందిని అర్హులుగా, 19,820 మందిని అనర్హులుగా గుర్తించామన్నారు. అనర్హతకు గల కారణాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఎంపిక కానివారికి ఈఎండీ రూ. 10 వేలను వారి ఖాతాల్లో జమ చేస్తామని స్పష్టం చేశారు. ఆగస్టు 28 నుంచి 31 వరకు వివిధ ప్రాంతాల్లో లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు మంత్రి షెడ్యూల్ ప్రకటించారు. 28న కౌకూర్, పాటిగడ్డ, జల్‌పల్లి, కుల్సుంపురలో, 29న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే కాలనీ, బోయిన్‌పల్లి వంటి ప్రాంతాల్లో, 30న గాజుల రామారం, అంబర్‌పేట, 31న రాయదుర్గం, కేపీహెచ్‌బీ కాలనీలలో డ్రా ఉంటుందని వివరించారు. అంతేకాకుండా, మరో నాలుగు నియోజకవర్గాల్లో కొత్తగా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి స్థలాలను ఎంపిక చేశామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఎల్‌బీనగర్, గోషామహల్, ముషీరాబాద్, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల్లో మొత్తం 1,920 ఇళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. వీటికి సెప్టెంబరు 3 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## కోదాడలో బస్సు ప్రమాదం.. స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్న ఆయన, ఈ మేరకు 'ఎక్స్' వేదికగా స్పందించారు. మృతుల కుటుంబాలకు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ప్రమాదంలో గాయపడిన వారికి తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లాలో బుధవారం తెల్లవారుజామున ఈ ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై నిలిపి ఉంచిన కంటైనర్ ట్రక్కును ఒక ప్రైవేటు బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మహిళలతో సహా మొత్తం ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో 20 మందికి పైగా ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ఘటనపై మంత్రి తీవ్రంగా స్పందించారు. కోదాడ మండలం ద్వారకుంట వద్ద ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో బస్సు సుమారు 42 మంది ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరుకు వెళుతోంది. ఇనుప రాడ్ల లోడుతో ఉన్న కంటైనర్‌ను బస్సు వేగంగా ఢీకొట్టడంతో, ఆ రాడ్లు బస్సు ముందు భాగంలోకి చొచ్చుకువచ్చాయి. ఫలితంగా డ్రైవర్ క్యాబిన్‌తో పాటు ముందు వరుసలోని ప్రయాణికుల సీట్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. పలువురు ప్రయాణికులు బస్సులోనే ఇరుక్కుపోయి ప్రాణాలు కోల్పోవడం విషాదం నింపింది.

## హైదరాబాద్ నుంచి నేపాల్ వెళ్లిన వారు సురక్షితం

**నేపాల్‌లో మెరుపు వరదలతో 95 మంది మృతి, 500 మంది గల్లంతు**

**హైదరాబాద్ నుంచి కైలాస యాత్రకు వెళ్లిన 156 మంది సురక్షితం**

**తమకు సాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి**

**బాధితులను రప్పిస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే పార్థసారథి**

హిమాలయ దేశం నేపాల్‌ను మెరుపు వరదలు ముంచెత్తాయి. ఈ ఆకస్మిక ప్రకృతి బీభత్సంలో ఇప్పటివరకు 95 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 500 మంది వరకు గల్లంతయ్యారు. ఇదే సమయంలో కైలాస మానసరోవర యాత్ర కోసం తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లిన యాత్రికుల భద్రతపై ఆందోళన నెలకొనగా, వారంతా క్షేమంగా ఉన్నట్లు తెలియడంతో కుటుంబసభ్యులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే, కైలాస మానసరోవర యాత్రకు హైదరాబాద్ నుంచి వెళ్లిన 156 మంది యాత్రికుల బృందం సురక్షితంగా ఉన్నట్లు సమాచారం అందింది. వరదల ప్రభావం లేని ప్రాంతంలో వారు క్షేమంగా ఉన్నారని అధికారులు తెలిపారు. వీరంతా చైనా సరిహద్దుకు సమీపంలో సురక్షితంగానే ఉన్నప్పటికీ, భారీ వర్షాలు, వరదల కారణంగా రోడ్డు మార్గాలు పూర్తిగా కొట్టుకుపోయాయి. దీంతో వారు ఉన్న ప్రాంతం నుంచి నేపాల్ రాజధాని కాఠ్‌మాండూ చేరుకోవడం కష్టతరంగా మారింది. తమను సురక్షితంగా స్వదేశానికి చేర్చేందుకు ప్రభుత్వం సహాయం చేయాలని వారు కోరుతున్నారు. వీరిలో, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన యాత్రికులు కూడా ఉన్నారు. తాము ప్రస్తుతం చైనా భూభాగంలోని డార్సి ప్రాంతంలో ఓ హోటల్ లో ఉన్నామని, భూమికి 15 వేల అడుగుల ఎత్తులో ఉండడం వల్ల తమకేమీ వరద ముప్పులేదని తెలిపారు. అయితే, తాము సెప్టెంబరు 1న భారత్ తిరిగి రావాల్సి ఉందని, తమ వీసాలు ట్రావెల్ ఏజెన్సీ వద్ద ఉండడంతో ఎలా రావాలో అర్థం కావడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి వెంటనే స్పందించారు. ఆయన నేపాల్‌లో చిక్కుకున్న యాత్రికులతో ఫోన్‌లో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. వారిని సురక్షితంగా వెనక్కి తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వంతో సమన్వయం చేసి తగిన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.



# తెలంగాణ సమీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల ప్రస్తుత పురోగతిపై సమగ్ర విశ్లేషణ చేసేందుకు ప్రత్యేకంగా కమిటీకి బాధ్యతలు అప్పగించాలన్నారు. డిసెంబర్ లో జరగనున్న సమ్మిట్ కోసం దేశీయంగా, అంతర్జాతీయంగా విస్తృతంగా రోడ్ షోలు నిర్వహించి పెట్టుబడి దారులను ఆకర్షించాలని చెప్పారు. ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే పక్రియను వేగవంతం చేయాలన్నారు. సమ్మిట్ పనుల పురోగతిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రోజుకు కనీసం ఒక గంట కేటాయించి రోజువారీ సమీక్షలు నిర్వహించాలని, ప్రతి కమిటీకి కేటాయించిన బాధ్యతలను టైమ్‌లైన్ ప్రకారం పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

# నేపాల్‌లో వరద బీభత్సం.. 95 మంది మృతి

(మొదటి పేజీ తరువాయి)

వెలికితీశారు. మరో 403 మంది గల్లంతైనట్లు నమోదైంది. అయితే గల్లంతైన వారి జాబితా ప్రాథమికమైనదని, సహాయక చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో సంఖ్యల్లో మార్పులు ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు.

133 మంది భారతీయులు

గల్లంతైన 403 మందిలో 341 మంది విదేశీయులు ఉన్నారు. వారిలో 133 మంది భారతీయులు ఉన్నట్లు తాజా సమాచారం. వీరిలో కొందరు కైలాస్--మానస సరోవర యాత్రకు వెళ్తున్నవారిగా అధికారులు గుర్తించారు. అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా తదితర దేశాలకు చెందిన పర్యాటకులు కూడా గల్లంతైన వారి జాబితాలో ఉన్నారు.

ఒక్కసారిగా పెరిగిన నదీ ప్రవాహం

బుధవారం ఉదయం సుమారు 8.30 నుంచి 9 గంటల మధ్య భోటెకోషి నదిలో నీటిమట్టం ఒక్కసారిగా పెరిగింది. టిబెట్ వైపు ల్హెండే నదీ పరివాహక ప్రాంతంలో భారీ మంచు--రాళ్ల కొండచరియ విరిగిపడటం వల్ల నీటి ప్రవాహం ఒక్కసారిగా ఉధృతమైనట్లు ప్రాథమిక అంచనాలు ఉన్నాయి. దీనికి ముందు సంభవించిన 4.4 తీవ్రత కలిగిన భూకంపం కూడా ఈ ఘటనకు కారణమై ఉండొచ్చని అధికారులు పరిశీలిస్తున్నారు. అయితే పూర్తి కారణాన్ని శాస్త్రీయంగా నిర్ధారించాల్సి ఉంది.

ధ్వంసమైన రహదారులు.. నిలిచిన రాకపోకలు

వరద ఉధృతికి అనేక రహదారులు, వంతెనలు కొట్టుకుపోవడంతో ప్రభావిత ప్రాంతాలకు చేరుకోవడం సహాయక బృందాలకు కష్టంగా మారింది. విద్యుత్, కమ్యూనికేషన్ వ్యవస్థలకు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలు జలవిద్యుత్ ప్రాజెక్టులు దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు.

ఐదు జిల్లాలకు హై అలర్ట్ వరద ప్రభావం మరింత దిగువ ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉండటంతో రసువా, నువాకోట్, ధాదింగ్, చిత్వన్, గోర్ఖా జిల్లాలను అప్రమత్తం చేశారు. భోటెకోషి, త్రిశూలి, నారాయణి నదుల పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు నదీ తీరాలకు వెళ్లవద్దని, సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు సూచించారు. ముమ్మరంగా సహాయక చర్యలునేపాల్ సైన్యం, సాయుధ పోలీసు, పోలీసు బలగాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. హెలికాప్టర్ల ద్వారా గాలింపు, తరలింపు చర్యలు చేపడుతున్నారు. అయితే భారీగా పేరుకుపోయిన బురద, తెగిపోయిన రహదారులు, ప్రతికూల వాతావరణం కారణంగా సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. భారత్, చైనా కూడా సహాయక చర్యలకు మద్దతు అందిస్తున్నాయి.

వైద్య సహాయం అందిస్తున్న డబ్ల్యూహెచ్‌ఓ

వరద బాధిత ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవలకు సహకరించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) మందులు, బహుళ ప్రయోజన టెంట్లు తదితర అత్యవసర సామగ్రిని పంపించింది. వ్యాధుల వ్యాప్తి నివారణ, ఆరోగ్య పరిస్థితుల పర్యవేక్షణకు కూడా చర్యలు చేపడుతున్నట్లు ఔనూ తెలిపింది.

## కేసీఆర్ పాలన ప్రజా సంక్షేమంగా సాగితే.. రేవంత్ పాలన భూముల వ్యాపారంగా సాగుతోంది: హరీశ్ రావు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఎక్కడ పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే అక్కడ భూములను విక్రయిస్తూ భావి తరాలకు కనీసం స్థలం కూడా లేకుండా చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. సామాన్య ప్రజల ఆస్తులనేమో 22ఏ నిషేధిత జాబితాలోకి నెడుతూ, ప్రభుత్వ భూములను మాత్రం ముఖ్యమంత్రి సోదరుల చేతుల్లోకి వెళ్లేలా చేస్తున్నారని విమర్శించారు. లక్షలాది ఎకరాల అసైన్డ్ భూములను పేదల వద్ద నుంచి లాక్కొని, కమీషన్ల కోసం పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. ఎప్పుడు 'హైడ్రా' వచ్చి ఇళ్లను కూలుస్తుందో, ఎప్పుడు 22ఏ పేరుతో తమ భూములను గుంజుకుంటారోనని ప్రజలు భయాందోళనలతో బతుకుతున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు కోటి ఎకరాలను, ఒక్క హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను రేవంత్ ప్రభుత్వం 22ఏ జాబితాలో చేర్చిందని ఆరోపించారు. ప్రభుత్వం చేసిన తప్పుకు ప్రజలను ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిప్పుతూ... జాబితా నుంచి భూములను తొలగించడానికి 30 శాతం వరకు కమీషన్లు వసూలు చేస్తున్నారని విమర్శించారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈ 22ఏ అంశంపై ప్రభుత్వాన్ని తీవ్రంగా నిలదీస్తామని స్పష్టం చేశారు. బాధితులు ఎవరూ బ్రోకర్లకు ఒక్క రూపాయి కూడా ఇవ్వొద్దని, ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యతను బీఆర్ఎస్ పూర్తిగా తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

# గ్రేటర్ హైదరాబాద్‌లో ఒకే రోజు 17 అక్రమ కట్టడాల కూల్చివేత

(మొదటి పేజీ తరువాయి)

ఏడంతస్తుల భవనం కుప్పకూలిన ఘటన.. నగరం ఎదుర్కొంటున్న పెను ప్రమాదాన్ని కళ్లకు కట్టింది. ఒకప్పుడు అటవీ ప్రాంతంగా ఉన్న ఈ ప్రదేశం, ఐటీ అభివృద్ధి పుణ్యమా అని రియల్ ఎస్టేట్ కేంద్రంగా మారి, ఇప్పుడు అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారింది. 50–60 గజాల చిన్న స్థలాల్లో సైతం కనీస భద్రతా ప్రమాణాలు పాటించకుండా ఏడంతస్తుల దాకా భవనాలు నిర్మించడమే తాజా దుర్ఘటనకు కారణమని స్పష్టమవుతోంది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీక్ష సమావేశంలో అధికారుల తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. పౌరుల ప్రాణాలతో చెలగాటమాడితే సహించేది లేదని, అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశాలు జారీ చేశారు. సీఎం ఆదేశాలతో జీహెచ్‌ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల అధికారులు రంగంలోకి దిగారు. మంగళవారం ఒక్కరోజే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 17 అనధికార కట్టడాలను కూల్చివేశారు. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్లలో ఈ కూల్చివేతలు జరిగాయి. ఇప్పటివరకు మూడు జోన్లలో 54 అక్రమ నిర్మాణాలను గుర్తించగా, నిర్మాణ దశలో ఉన్నవాటిని నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేయాలని అధికారులు నిర్ణయించారు. ఇదిలా ఉండగా, అంజయ్యనగర్ భవన ప్రమాద ఘటనలో ప్రధాన నిందితుడైన కాంట్రాక్టర్ మహ్మద్ ఖాజామియాను పోలీసులు అరెస్ట్ చేశారు. నాసిరకం సామగ్రితో నిర్మాణం చేపట్టడంతో పాటు, ప్రమాదాన్ని ముందే పసిగట్టినా అధికారులకు సమాచారం ఇవ్వకుండా పరారైనట్లు దర్యాప్తులో తేలింది. గచ్చిబౌలి టీఎన్‌జీవో కాలనీ వంటి ఇతర ప్రాంతాల్లోనూ ఇదే తరహా అక్రమ నిర్మాణాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## నేపాల్‌లో జల విలయం.. ప్రధాని బాలేన్ షాతో మాట్లాడిన మోదీ

(మొదటి పేజీ తరువాయి)

నదిలో బుధవారం ఆకస్మికంగా సంభవించిన వరదల కారణంగా పెను విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో 100 మందికి పైగా భారతీయులతో సహా వందలాది మంది పర్యాటకులు గల్లంతయ్యారు. ఈ విపత్కర పరిస్థితుల్లో నేపాల్‌కు అండగా నిలుస్తామని భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. బుధవారం నేపాల్ ప్రధాని బాలేంద్ర షాతో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. నేపాల్‌కు అవసరమైన అన్ని రకాల మానవతా సాయం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు. "ఈ కష్టకాలంలో నేపాల్ సోదర సోదరీమణులకు భారత ప్రజలు తోడుగా ఉంటారు. సహాయక చర్యల కోసం మన బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి" అని మోదీ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. నేపాల్ టూరిజం బోర్డు (ఎన్టీబీ) విడుదల చేసిన ప్రాథమిక నివేదిక ప్రకారం, ఈ వరదల్లో మొత్తం 384 మంది పర్యాటకులు గల్లంతయ్యారు. వీరిలో 105 మంది భారతీయులు, 93 మంది నేపాల్ పౌరులు, మిగిలిన వారు విదేశీయులు ఉన్నారు. గల్లంతైన విదేశీయులలో యూకే, ఆస్ట్రేలియా, అమెరికా, మలేషియా, దక్షిణాఫ్రికా, నెదర్లాండ్స్ దేశాలకు చెందిన వారు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే, ఈ సంఖ్య ప్రాథమికమైనదేనని, ట్రావెల్ ఏజెన్సీలు, స్థానిక అధికారులతో కలిసి వివరాలను ధ్రువీకరిస్తున్నామని ఎన్టీబీ స్పష్టం చేసింది. గల్లంతైన వారు తొమ్మిది వేర్వేరు ట్రావెల్ ఏజెన్సీల ద్వారా నేపాల్ పర్యటనకు వచ్చారని ప్రాథమిక సమాచారం. కాఠ్మండు టైమ్స్ కథనం ప్రకారం, ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు ఏడుగురు మరణించినట్లు నిర్ధారణ అయింది. గల్లంతైన వారి ఆచూకీ కోసం అధికారులు, సహాయక బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. సమాచారం లేదా సహాయం కోసం పర్యాటకులు, వారి కుటుంబ సభ్యుల కోసం నేపాల్ టూరిజం బోర్డు పలు ఎమర్జెన్సీ నంబర్లను (1234, 1144, 9851289445) జారీ చేసింది. వరద ప్రభావిత ప్రాంతాల్లోని పర్యాటకులు ఆందోళన చెందవద్దని, అధికారిక ప్రకటనలను అనుసరించాలని సూచించింది.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్





**ఖానాపూర్ ఆర్సి మన దునియా, ఆగస్టు 26:**

ఖానాపూర్ మండలంలోని సూజాపూర్, మేడంపల్లి గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ధైర్యం చెప్పారు.సూజాపూర్ గ్రామానికి చెందిన షేక్ ఘౌస్ జీవనోపాధి కోసం సౌదీ అరేబియాలో పనిచేస్తూ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్ వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి, ఈ విషాద సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఘౌస్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.అనంతరం మేడంపల్లి గ్రామానికి చెందిన భూక్యా రవి ప్రమాదవశాత్తు పాము కాటుకు గురై మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని కూడా ఎమ్మెల్యే పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, రవి మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కుటుంబానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం తన బాధ్యత అని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలు ధైర్యంగా ఉండాలని, ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వకర్మ కార్పెంటర్స్‌కు అండగా ఉంటా





**ప్రభుత్వ నిధుల సాధనకు కృషి చేస్తా**

**పెన్షన్లు, ఇళ్లు, రోడ్ల సమస్యల పరిష్కారానికి సహకారం**

**నూతన కమిటీ ప్రమాణ స్వీకారంలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్‌కుమార్ దిలీప్**

**మన దునియా--హుజురాబాద్ నియోజకవర్గం**

జమ్మికుంట: విశ్వకర్మ కార్పెంటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం జమ్మికుంట పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్‌కుమార్ దిలీప్ హాజరై నూతన కమిటీ సభ్యులను అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసోసియేషన్ నూతన అధ్యక్షుడు జూపాక శ్రీనివాసచారి, కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. జమ్మికుంటలో విశ్వకర్మ కార్పెంటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ బలమైన సంఘంగా ఉందన్నారు. సభ్యుల సంక్షేమం కోసం తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు.ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావడంతోపాటు సభ్యులకు సంబంధించిన పెన్షన్లు, ఇళ్ల మంజూరు, రోడ్లు తదితర సమస్యల పరిష్కారానికి తన పరిధిలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్‌కు సంబంధించిన ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి సహకరిస్తానని పేర్కొన్నారు.కార్యక్రమానికి తనను ఆహ్వానించిన అసోసియేషన్ సభ్యులకు చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చారి సంపత్‌చారి, నూతన కమిటీ సభ్యులు, అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..

**ఆరుగురి మృతి**

**మన దునియా,సూర్యాపేట జిల్లా:ఆగస్టు 26**

సూర్యాపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కోదాడ మండలం దొరకుంట శివారులో ఈరోజు (బుధవారం) తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనలో ఆరుగురు మృతిచెందారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉండగా.. మరో11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. ఈ ప్రమాదంతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.!ఈ ఘటనపై పోలీసులకు స్థానికులు సమాచారం అందజేశారు. పోలీసులు హుటాహుటినా సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వారిని సమీపంలోని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు ప్రయాణిస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దొరకుంట శివారులో ముందు వెళ్తున్న కంటైనర్ డీసీఎంను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ప్రైవేట్ ట్రావెల్స్‌లో మొత్తం 42 మంది ఉన్నారు. ఈ ప్రమాదం కారణంగా హైదరాబాద్ -- విజయవాడ మార్గంలో కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.ఈ ప్రమాదానికి బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమా, అతివేగమా, లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అన్నది పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కంటైనర్ డీసీఎంను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొనడంతోనే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, మృతుల గుర్తింపు, క్షతగాత్రుల సంఖ్యపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది..




# అర్హులైన ప్రతి ఒక్కరూ పెన్షన్‌కు దరఖాస్తు చేసుకోవాలి

- **ఈనెల 31వ తేదీతో దరఖాస్తుల స్వీకరణకు తుది గడువు**

**ఖానాపూర్ ఆర్సి మన దునియా, జన్నారం; ఆగస్ట్ 26:**




మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కవ్వాల్ గ్రామంలో ప్రభుత్వం అందించే సామాజిక భద్రతా పెన్షన్ పొందేందుకు అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని వారు వెంటనే దరఖాస్తులు సమర్పించాలని కవ్వాల్ ఉపసర్పంచ్ నల్లతీగల విష్ణు సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పెన్షన్ పొందేందుకు అర్హత ఉన్న వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.పెన్షన్ దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 31వ తేదీని చివరి గడువుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అర్హులు గడువు ముగిసేలోగా అవసరమైన ధ్రువపత్రాలతో సంబంధిత అధికారులకు తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వీలైనంత త్వరగా దరఖాస్తులు అందజేయాలని ఆయన కోరారు.అర్హత ఉన్న ఒక్కరూ అవకాశం కోల్పోకుండా గ్రామ ప్రజలు తమ పరిసరాల్లోని అర్హులకు సమాచారం అందించి దరఖాస్తు చేసుకునేలా సహకరించాలని నల్లతీగల విష్ణు విజ్ఞప్తి చేశారు.

# బహుజనుల బతుకులు మారాలంటే బిఎస్పి పార్టీ తోనే సాధ్యం

- **వరికిల్ల మల్లేష్ వరంగల్ జోన్ -2,జోన్ ఇంచార్జి**

**మన దునియా, ఆగస్ట్ 26,మంచిర్యాల జిల్లా**



చెన్నూరు నియోజకవర్గం లోని కోటపల్లి మండల కేంద్రంలో బహుజన్ సమాజ్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం లో ముఖ్యఅతిథి గా వరంగల్ జోన్ -2 జోన్ ఇంచార్జ్ వర్కిల్ల మల్లేష్ హాజరై మాట్లాడుతూ పూలే, అంబేద్కర్ యొక్క సిద్ధాంతాన్ని బోధించడం జరిగింది ఓటును అమ్ముకోవద్దు నమ్ముకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ ఏనుగు గుర్తుకు ఓటు వేసి ఆత్మగౌరవంతోటి జీవించాలని కోరుతూ బిఎస్పి పార్టీ కార్యకర్తలను ప్రజలకు వెళ్లి నిర్మాణం మహనీయుల యొక్క సిద్ధాంతాన్ని బోధిస్తూ పార్టీ నిర్మాణం సెక్టర్ కమిటీలు బూత్ కమిటీలు వేయాలని ఆదేశించడం అయినది ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులు పార్లమెంట్ ఇంచార్జ్ లు కాదాసీ రవీందర్, బాల కళ్యాణ్ పంజా, ప్రత్యేక అతిథి ముల్కల్ల రాజేంద్రప్రసాద్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు, జిల్లా ఈసీ మెంబర్ శెట్టి ప్రవళిక, చెన్నూరు నియోజకవర్గ ఇన్చార్జ్ చెన్నూరి రాజు, చెన్నూరు నియోజకవర్గ అధ్యక్షులు గాజుల శంకర్, ఉపాధ్యక్షులు ఎండి మతిన్ ఖాన్ నాయకులు సుందిళ్ల అశోక్, శెట్టి శంకరయ్య, కోటపల్లి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా డా. ఎస్ ఎస్ హార్డికర్ వర్ధంతి

**మన దునియా, ఆగస్ట్ 26,మంచిర్యాల జిల్లా**





అఖిల భారత కాంగ్రెస్ సేవాదళ్ వ్యవస్థాపకులు డా. ఎస్.ఎస్ హార్డికర్ వర్ధంతి సందర్భంగా మందమర్రి పట్టణ సేవాదళ్ అధ్యక్షులు సోతుకు ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ.పాషా,ఎస్సీ సెల్ మాజీ చైర్మన్ సంఫీ సంతోష్,మాజీ పట్టణ అధ్యక్షులు మంకు రమేష్,యువజన కాంగ్రెస్ నాయకుడు రాయబారపు కిరణ్,మొగిలిచర్ల రాజేష్,ఇప్ప శ్రీనివాస్,నీలం చిరంజీవి,సూరం శ్రీనివాస్,వాల్మీకి శ్రీధర్,నరసయ్య,దుర్గం రవి,ఎర్రం తిరుపతి,అవునూరి నాగరాజు పాల్గొన్నారు.

మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

# హైదరాబాద్‌లో చింతగూడ విద్యార్థి మృతి.. గ్రామంలో విషాదఛాయలు

**ఖానాపూర్ ఆర్సి మన దునియా; జన్నారం, ఆగస్టు 26:**



అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న జన్నారం మండలం చింతగూడ గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి అక్కవత్తుల మనోహర్ (24) బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చింతగూడ గ్రామానికి చెందిన అక్కవత్తుల పోశన్న, నర్సవ్వ దంపతుల ఏకైక కుమారుడు మనోహర్. బీటెక్ విద్యను అభ్యసిస్తున్న ఆయన చదువులో ప్రతిభ కనబరుస్తూ ఎంతో చురుగ్గా ఉండేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అందరితో కలుపుగోలుగా ఉండే మనోహర్ అనారోగ్యంతో అకస్మాత్తుగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. కొన్ని రోజులుగా మనోహర్ తీవ్ర జ్వరంతో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యులు చికిత్స అందించినప్పటికీ ఆరోగ్యం విషమించడంతో బుధవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచాడు. ఏకైక కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు పోశన్న, నర్సవ్వ కన్నీరుమున్నీరుగా విలపించారు. మనోహర్ మృతితో చింతగూడ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల రోదనలు స్థానికులను కలచివేశాయి. గ్రామస్థులు మనోహర్ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# మడిపల్లిలో ఘనంగా ఎస్ఎస్ ఈవెంట్స్ ప్రారంభం

**మన దునియా హుజురాబాద్ నియోజకవర్గం జమ్మికుంట**





జమ్మికుంట,మండలంలోని మడిపల్లి గ్రామ పంచాయతీ కాంప్లెక్స్ ఆవరణలో అంబాల వంశీ, గంగారపు వేణు సారథ్యంలో ఏర్పాటు చేసిన ఎస్ఎస్ ఈవెంట్స్ డీజే సౌండ్స్, డెకరేషన్, టెంట్‌హౌస్‌ను బుధవారం గ్రామ సర్పంచ్ మ్యాకమల్ల తిరుమల ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి సంస్థకు శ్రీకారం చుట్టిన సర్పంచ్.. నిర్వాహకులు, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నూతనంగా ప్రారంభించిన ఎస్ఎస్ ఈవెంట్స్ ద్వారా వివిధ శుభకార్యాలు, వేడుకలకు డీజే సౌండ్స్, డెకరేషన్, టెంట్‌హౌస్ సేవలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ హుజూరాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు), బీఎస్పీ సీనియర్ నాయకులు మారపల్లి మోగిలయ్య, జర్నలిస్ట్ అంబాల శ్రీరామ్, వార్డు సభ్యులు గంగారపు సాయిరామ్, బోనగాని సురేష్, మాజీ ఉపసర్పంచ్ పోషిణి సత్యం, పోషాలు, గంగారపు ఐలయ్య, అప్పాలు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# సంగెం మండలం నరసానగర్ గ్రామంలో పుట్టినరోజు వేడుకల్లోడాక్టర్ కాళీ ప్రసాదరావు

**సంగెం మన దునియా ఆగష్టు 26**

రుద్రాన్స్ పటేల్ ప్రథమ పుట్టినరోజు వేడుకల్లో డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావుపరకాల నియోజకవర్గం సంగెం మండలం నరసానగర్ గ్రామానికి చెందిన 211వ బూత్ అధ్యక్షులు రొట్టె రాంబాబు గారి కుమారుడు రుద్రాన్స్ పటేల్ ప్రథమ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పరకాల నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు గారు హాజరై చిన్నారి రుద్రాన్స్ పటేల్‌ను ఆశీర్వదించి, కానుక అందజేశారు. అనంతరం రొట్టె రాంబాబు గారి కుటుంబ సభ్యులకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగెం మండల అధ్యక్షులు దామెర్పుల చంద్రమౌళి, రంగంపేట గ్రామ సర్పంచ్ బెజ్జంకి శేషాద్రి, జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షులు ఎండి రహమతుల్లా, సీనియర్ నాయకులు భూక్యా వెంకన్న, ఓదెల శంకర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.




# క్యాన్సర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా వుండాలి

**యశోద హాస్పిటల్ సికింద్రాబాద్ అంకాలజిస్ట్ డాక్టర్ మల్లుపట్టు సుమంత్ కుమార్**

**మన దునియా,హైదరాబాద్:ఆగస్టు 26**




క్యాన్సర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్యంగా ఉండేవారికి కూడా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని ఎటువంటి చెడు అలవాట్లు లేనివారికి కూడా వంశపారంపర్యంగా కూడా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని యశోద హాస్పిటల్స్ సికింద్రాబాద్ అంకాలజిస్ట్ డాక్టర్ మల్లుపట్టు సుమంత్ కుమార్ అన్నారు. సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ నందు క్యాన్సర్ వ్యాధికి మెమొగ్రామ్ వంటి వైద్య పరీక్షలు అందుబాటులో వున్నాయని చెప్పారు. బుధవారం సూర్యాపేట ఎమ్మెన్నార్ ఫంక్షన్ హాల్ లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్యం హోటల్స్ లో తినడం వలన కూడ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని అన్నారు. పెద్ద పెద్ద రెస్టారెంట్ లలో కూడ నిల్వ వుంచిన ఆహారపదార్ధలు వండుతున్నారని, వాటి వలన కూడ వ్యాధులు వస్తాయని చెప్పారు. మనం కూరగాయలు కొని వాటిని వేడినీటిలో కడిగి వండుకోవాలని సాధ్యమైనంత వరకు ఇంటి వద్దనే తినడం ఆరోగ్యానికి మంచిదని అన్నారు. ఆకస్మాత్తుగా బరువు తగ్గిపోవటము లేదా ఎక్కువగా నీరసంగా అనిపించడం, అలసట, ఎక్కువ నడవలేకపోవడం, శారీరక శ్రమ చేయలేకపోవటం కూడా క్యాన్సర్ లక్షణాలని ఆయన చెప్పారు. మహిళలు 45 సంవత్సరాలు దాటిన వారికి రొమ్ము క్యాన్సర్ లేదా సర్వైకల్ క్యాన్సర్ గాని వచ్చే అవకాశాలు ఉన్నాయని వారు చిన్నపాటి వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. మహిళలకు సర్వైకల్ క్యాన్సర్ రాకుండా వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. పురుషుల్లో కూడా ఎక్కడైనా కణతులు ఏర్పడి అవి పెరుగుతున్నట్లయితే ప్రారంభ దశలోనే వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిదని ఆయన అన్నారు. ప్రారంభ దశలో అయితే చిన్న సర్జరీతో నయమవుతుందని అన్నారు. యశోద హాస్పిటల్స్ సికింద్రాబాద్ లో క్యాన్సర్ కు మెరుగైన చికిత్స లభిస్తుందని ఆయన చెప్పారు. ఏదైనా వ్యాధి నయం కాకుండా దీర్ఘకాలం పాటు వున్నట్లయితే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలని అన్నారు. తాను ప్రతి రెండవ బుధవారం నాలుగవ బుధవారం సూర్యాపేటలో కనెక్ట్ దయాగ్నాటిక్ సెంటర్ లో అందుబాటులో ఉంటారని చెప్పారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం





**మన దునియా కమలాపూర్**

పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తోందని హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఓడితల ప్రణవ్‌బాబు అన్నారు. బుధవారం కమలాపూర్ మండలం గూడూరు గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన హాజరై లబ్ధిదారులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రణవ్‌బాబు మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు సొంతింటి భరోసా కల్పిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేదలకు ప్రభుత్వం ఇళ్లను అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వాసాల శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలసాని రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్ల రమేష్, మాజీ ఎంపీపీ తడక శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు పాక చంద్రమౌళి, భాష బోయిన రమేష్, గాలిబు నవీన్, కొండపాక మనీష్, ఎర్రగొల్ల రాజు, గూడూరు గ్రామ కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

# ఒత్తిడిని తగ్గించుకోవాలంటే ఏం చేయాలో తెలుసా?

ఈ రోజుల్లో ఉద్యోగ రీత్యా లేదా ప్రేమ, డబ్బు లేదా ఫ్యామిలీ పరంగా ఏదయినా కారణం చేత చాలామంది టెన్షన్ లేదా ఒత్తిడికి గురవుతారు. దీని వలన మన మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. ప్రతి చిన్న దానికి ఎక్కువగా ఆలోచించడం వలన కూడా టెన్షన్, ఒత్తిడి వంటివి పెరుగుతాయి. మనం ఇతరులతో ఎలా మాట్లాడాలి వారు మనకు ఎలా స్పందిస్తారో ముందుగా ఊహించుకొని మనం అనుకున్న అంచానాలు రీచ్ అవ్వకపోయినా ఒత్తిడికి గురవుతారు. కాబట్టి మనం ప్రతి విషయంలో ఎలా జరిగిన దానిని స్వీకరించగలగాలి అంతేగాని దాని గురించి ఆలోచిస్తూ ఉండకూడదు. మన మూడ్ సరిగ్గా లేకపోయిన ఆ సమయంలో మనం తీసుకునే నిర్ణయాలు చెడుగా ఉంటాయి. దీని వలన మనం అవతలివారిలో నెగిటివిటీ ని పెంచిన వారమవుతాము. తరువాత మనం వారు మన గురించి ఏమి ఆలోచిస్తున్నారో అని అనుకుంటూ ఉంటాము ఇలా ఆలోచనలతో ఒత్తిడికి గురవుతాము. కాబట్టి మన మూడ్ బాగోలేనప్పుడు ఎటువంటి నిర్ణయాలు తీసుకోకపోవడమే మంచిది. లావుగా ఉన్నామని లేదా సన్నగా ఉన్నామని లేదా ఏదయినా మానసిక, శారీరక సమస్య వచ్చినా కొందరు చాలా బాధపడుతుంటారు. అంతే కానీ సమస్యకు పరిష్కారం వెతకరు. కాబట్టి మనం ఏదయినా సమస్య వచ్చినప్పుడు బాధపడకుండా దానికి పరిష్కారం వెతకాలి. ఈ మధ్య చాలామంది దానిలోనే సినిమాలు, సీరియళ్లు, షోస్ చూస్తున్నారు కాబట్టి దీని వలన మనం ఎక్కువ సమయం స్క్రీన్ మీద గడుపుతున్నారు. దీని వలన మెంటల్ హెల్త్ ఇష్యూస్ వచ్చే అవకాశం ఉంది. కాబట్టి మనం  లో సినిమాలు, సిరీస్ లు చూసేటప్పుడు మద్యమద్యలో బ్రేక్ ఇస్తూ ఉండాలి దాని వలన మన ఆరోగ్యానికి మంచిది. ఒత్తిడి వలన మనకు గుండె సమస్యలు, ఆస్తమా, హైపర్ టెన్షన్, జుట్టు రాలడం వంటి సమస్యలు వస్తాయి. ఒత్తిడిని, టెన్షన్ ను తగ్గించుకోవడానికి మనం మొదట ఎక్కువగా ఆలోచించడం తగ్గించు కోవాలి. ఇంకా యోగా, ధ్యానం వంటివి చేస్తూ ఉండాలి. వీటి వలన రిలీఫ్ గా ఉంటుంది.



# పిల్లలు ఎర..తల్లులు సొర.

**పిల్లల్ని ఎరగా వేసి తల్లులకు వల..!**

**మన దునియా,కాకినాడ:ఆగస్టు 26**

కాకినాడ క్రైం: సౌజన్యను సాధిక్ ఖాన్ ట్రాప్ చేసి తన దారిలోకి తెచ్చుకుంది మొదలు, ఓ క్రైం థ్రిల్లరిని తలపించేలా తన రాచకార్యాల్ని గుట్టుచప్పుడు కాకుండా కొనసాగించాడు. తన దారిలోకి తెచ్చుకోవడం, ఆమెపై ఇష్టాన్ని వ్యక్తం చేయడం, అక్రమ బంధాన్ని కొనసాగించడం, ఆమె భర్తను అడ్డు తొలగించుకునేందుకు కుయుక్తులు పన్నడం, ఆస్తి కాజేసేందుకు చేసిన కుట్ర, అంతకుముందు ఆమెను కొట్టడం, భర్తపై దాడి, బాధితురాలి కుటుంబసభ్యుల పైనా విరుచుకుపడడం, వారిని బ్లాక్మెయిల్ చేయడం ఇవేవీ థ్రిల్లర్కు తీసిపోని రీతిలో ఉన్నాయి. ఆత్మహత్య ఘటన తర్వాత తప్పించుకోవడానికి చేసిన విఫలయత్నాలు ఈ కోవకే చెంది పోలీసుల మతులనే పోగొట్టాయి. సౌజన్య లాంటి మరికొందరు సాధిక్ ఖాతాలో ఉండొచ్చన్న కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. పిల్లల్ని అడ్డుపెట్టుకొని తల్లులకు వల వేసేవాడని వారి ప్రాథమిక విచారణలో తేలింది.

**ఆ ఒక్క క్లూతోనే...**

కేవలం ఒక్క క్లూతోనే సాధిక్ జాడ బట్టబయలైందని పోలీసులు తెలిపారు. ఆత్మహత్యలు జరగడం, వాటికి తానే కారణం కావడంతో ఎవరూ అతడిపై ఆరోపణలు చేయకుండానే జాగ్రత్తపడి పరారయ్యాడు. అప్పటికి లేఖ దొరకలేదు, సాధిక్ ఖాన్ అనే వ్యక్తి పేరు కూడా ఎవరికీ తెలియదు. ఆ సమయంలో తాను వినియోగిస్తున్న ఒక్కొక్కటి రూ. 1.5 లక్షలు విలువ చేసే రెండు ఖరీదైన ఫోన్లు వదిలేసి పరారయ్యాడు. వెళుతూ రైఫిల్ అసోసియేషన్లో ఉన్న ఓ ఆప్తమిత్రుడికి ఫోన్ చేసి ఆ నంబర్ డిలీట్ చేసేశాడు. కొందరి ఫోన్ నంబర్లు పాకెట్ బుక్లో రాసుకొని బయల్దేరాడు. కాల్ రికార్డ్స్ డేటాలో ఆ కాల్ జాడ లభ్యమైంది. ఇంటి నుంచి నేరుగా ద్విచక్రవాహనంపై సామర్లకోటకు వెళ్లిన సాధిక్ బైక్ను పార్కింగ్లో ఉంచి కోణార్క్ ఎక్స్ప్రెస్ ఎక్కాడు. పలువురి ప్రయాణికుల ఫోన్లతో తనకు కావలసిన వారికి ఫోన్లు చేశాడు. చివరికి మహారాష్ట్రకు వెళ్లి తన స్నేహితుడిని కలిశాడు. అక్కడ ఒక రోజు ఉన్నాడు. తర్వాత రోజు మీరటికి బయల్దేరాడు. సరిగ్గా అదే సమయానికి కాకినాడ పోలీసులు సదరు మిత్రుడ్ని చేరారు, కొద్ది సేపటి ముందు సాధిక్ మీరట్కు అబ్బాస్ అనే మరో రైఫిల్ ట్రైనర్ను కలిసేందుకు వెళ్లాడని సమాచారం అందించాడు. అతడి కంటే ముందు అబ్బాస్ ఇంటి వద్దకు చేరుకున్న పోలీసులు సాధిక్ అబ్బాస్ ఇంటి వద్దకు సమీపిస్తుండగా పట్టుకున్నారు. అక్కడి నుంచి కేరళ వెళ్లాలని అనుకున్నాడని పోలీసులు తెలిపారు.

**కోడలిపై అనుమానం..**

కోడలి వ్యవహారశైలి ఆది నుంచీ అనుమానాస్పదంగానే తోచిందని సాధిక్ ఖాన్ చేతిలో హత్యకు గురయ్యాడని భావిస్తున్న జగదీశ్వర్రెడ్డి కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అనూహ్య




రీతిలో ఏ కారణం లేకుండానే జగదీష్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడని వాపోయారు. ఏడాది పాటు వాంతులు అయ్యాయని, కారణం తెలిసేది కాదని చెప్పుకొచ్చారు. మాట నెమ్మదించి, కాలు కూడా చచ్చుబడిందని అన్నారు. జీర్ణకోశ సమస్యతో బాధపడుతూ కాకినాడ సర్పవరంలో ఉన్న ఓ ఆసుపత్రిలో ఐదు రోజులు చికిత్స అనంతరం జగదీష్ మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్లో ఉన్న ప్రముఖ ఆసుపత్రి ఏషియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీకి వెళ్లి చికిత్స పొందినట్టు చెప్పారు. అక్కడ కాస్త కోలుకోగా, హైటెక్ సిటీలో ఉన్న ఓ ఫిజియోథెరపీ సెంటర్కు సౌజన్యతో పాటు ఆమె తల్లిదండ్రులు, అత్త, మామ తీసుకువెళ్లి చేర్చారు. కేవలం ఫిజియోథెరపీ చేస్తే చాలు కోలుకోవలసిన దశలో జగదీశ్వర్రెడ్డి హఠాత్తుగా మరణించాడు. ఫిజియోథెరపీ చేస్తుండగా తన భర్త స్పందించడం లేదని కోడలు సమాచారం ఇచ్చిందని జగదీశ్వర్రెడ్డి కుటుంబీకులు చెబుతున్నారు. సౌజన్య ప్రవర్తన తీవ్ర అనుమానాలకు తావిచ్చిందని తెలిపారు. ఆసుపత్రిలో చేర్చినప్పటి నుంచి తాను మాత్రమే ఉంటానని అందరూ వెళ్లిపోవాలని చెప్పేదన్నారు. చనిపోయే కొద్దిసేపటి ముందు కూడా తమను హోటల్ గదికి పంపేసిందని, తానే చూసుకుంటానని చెప్పిందని అంటున్నారు. సాధిక్ ఖాన్ ఆ సమయంలో వచ్చి సౌజన్యతో కలిసి జగదీష్ తాగే ప్రొటీన్ షేక్లో అంతకుముందు పట్టించిన స్లో పాయిజన్ గుణాలున్న రసాయనాన్ని మరోమారు కలిపి ఉంటాడని అనుమానిస్తున్నామని కుటుంబీకులు తెలిపారు.

**పిల్లలు ఎర.. తల్లులు సొర**

ఖతర్నాక్ ఖాన్ వ్యవహార శైలిని తమ పిల్లల్ని కోచింగ్లో చేర్పిన పలువురు తల్లులు పూసగుచ్చినట్టు తమను సంప్రదించిన మీడియాకు తెలిపారు. పిల్లల్ని అడ్డుపెట్టుకొని తమతో మాటకలిపేందుకు యత్నించేవాడని, తమ స్టేటస్లు, ఫేస్బుక్, ఇన్స్టాగ్రాం పేజీలు ఫాలో అవుతూ లైక్స్ కొడుతూ ముగ్గులోకి దించేందుకు యత్నించేవాడన్నారు. ఈ కారణంతోనే తమ పిల్లల్ని అతడి అకాడమీలో మానిపించేశామని కొందరు చెప్పారు. క్లాస్ ఇన్ఫర్మేషన్ కోసం అంటూ కాల్స్ చేసి అక్కర్లేని విషయాలతో మాటలు పెంచేవాడన్నారు.

## మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే



శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగినప్పుడు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఈ సమస్యలు ముఖ్యంగా ఆర్థరైటిస్, కిడ్నీ సంబంధిత వ్యాధుల రూపంలో కనిపిస్తాయి. అధిక యూరిక్ యాసిడ్ కారణంగా జాయింట్లలో నొప్పులు, వాపులు మొదలవుతాయి. గ్రీన్ కలర్ ఫుడ్స్ దినచర్యలో భాగం చేస్తే ఈ సమస్యను సహజంగా నివారించవచ్చు. పాలకూరలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇందులో ఉన్న మెగ్నీషియం శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. పాలకూరను రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి పుష్కలమైన పోషకాలు అందించడమే కాక.. ఆరోగ్యాన్ని కాపాడేందుకు సహాయపడుతుంది.పచ్చి బఠానీలలో ఫైబర్ అధికంగా ఉంటుంది.. ఇది శరీరానికి కావలసిన శక్తిని అందిస్తుంది. వీటిలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని డిటాక్స్ చేయడంలో తోడ్పడతాయి. గౌట్ వంటి సమస్యలను తగ్గించడానికి ఈ బీన్స్ చాలా ఉపయోగపడతాయి.గ్రీన్ టీ శరీరంలోని హానికరమైన వ్యర్థాలను బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఈ టీలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఆహ్లాదకరమైన రుచి యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో తోడ్పడతాయి. ప్రతిరోజూ ఒక కప్పు గ్రీన్ టీ తాగడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చు. సెలరీలో ఉన్న పోషకాలు మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తాయి. ఇది శరీరంలోని వాపును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ఈ ఆకుకూర సహాయపడుతుంది. అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. ప్యూరిన్లు సమతుల్యంగా ఉంటాయి. ఇది శరీరంలోని హానికరమైన పదార్థాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కాబట్టి ఆస్పరాగస్ ను తగిన మోతాదులో తీసుకోవడం మంచిది.గ్రీన్ బీన్స్ లో ప్యూరిన్లు తక్కువగా ఉంటాయి.. అందుకే ఇవి యూరిక్ యాసిడ్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి.

## సెర్వైకల్ నొప్పితో బాధపడుతున్నారా?



ఈ డిజిటల్ యుగంలో చాలా మంది గంటల తరబడి కంప్యూటర్, ల్యాప్టాప్ లేదా మొబైల్పై పని చేస్తారు. దీని వల్ల మెడ, భుజాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ కారణంగా చాలా మంది సెర్వైకల్ స్పాండిలైటిస్ లేదా మెడ నొప్పి సమస్యను ఎదుర్కొంటారు. ఈ డిజిటల్ యుగంలో చాలా మంది గంటల తరబడి కంప్యూటర్, ల్యాప్టాప్ లేదా మొబైల్పై పని చేస్తారు. దీని వల్ల మెడ, భుజాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ కారణంగా చాలా మంది సెర్వైకల్ స్పాండిలైటిస్ లేదా మెడ నొప్పి సమస్యను ఎదుర్కొంటారు. మెడలో బిగుసుకుపోవడం, భుజాలలో ఒత్తిడి, తలనొప్పి, వీపు నొప్పి వంటివి సెర్వైకల్ లక్షణాలుగా ఉండవచ్చు. సెర్వైకల్ నొప్పిని తగ్గించడానికి మీరు కొన్ని వ్యాయామాల సహాయం తీసుకోవచ్చు. ఈ వ్యాయామం మెడ బిగుసుకుపోవడాన్ని తగ్గిస్తుంది. కండరాలను సడలిస్తుంది. ఈ వ్యాయామం చేయడానికి నిటారుగా కూర్చోండి లేదా నిలబడండి. ఆ తర్వాత మెడను నెమ్మదిగా ముందుకు వంచండి. ఆపై వెనుకకు వంచండి. ఈ ప్రక్రియను 5 నుండి 10 సార్లు చేయండి. దీని వల్ల సెర్వైకల్ నొప్పి తగ్గవచ్చు. ఇది మెడ సౌలభ్యాన్ని పెంచుతుంది. రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఈ వ్యాయామం చేయడానికి తలను నెమ్మదిగా కుడి వైపుకు తిప్పండి. కొన్ని సెకన్ల పాటు ఆపండి. ఆ తర్వాత తలను ఎడమ వైపుకు తిప్పండి. రెండు దిశలలో ఒక్కొక్కటి 5 సార్లు చేయండి. ఇది మెడ పక్కని కండరాలకు ఉపశమనం కలిగిస్తుంది. తలను నెమ్మదిగా కుడి వైపుకు వంచండి (చెవిని భుజం వైపు తీసుకురండి). 10 సెకన్ల పాటు ఆపండి. ఆపై ఎడమ వైపుకు పునరావృతం చేయండి. ఈ ప్రక్రియను 3-4 సార్లు చేయండి. ఈ భంగిమ మీ మెడ స్థానాన్ని మెరుగుపరుస్తుంది. సెర్వైకల్ నొప్పిని తగ్గిస్తుంది. దీన్ని చేయడానికి మీ వీపు, మెడను నిటారుగా ఉంచండి. ఆపై గడ్డాన్ని మెడ వైపు నెమ్మదిగా లోపలికి లాగండి. 5 సెకన్ల పాటు ఆపి, ఆ తర్వాత సాధారణ స్థితికి తిరిగి వెళ్లండి. దీన్ని 10 సార్లు పునరావృతం చేయండి.

## బీపీతో ఇబ్బందిపడుతున్నారా?

రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అరటిపండు.. ప్రతి సీజన్లో ప్రతిచోటా సులభంగా లభించే పండు. ఇది ఒక సూపర్ ఫుడ్. వైద్యుల నుండి డైటీషియన్ల వరకు అందరూ రోజూ తినాలని సిఫార్సు చేస్తారు. ముఖ్యంగా బిపి రోగులకు ఇది ఒక దివ్యౌషధం లాంటిది. బీపీ రోగులు రోజూ ఒక అరటిపండు తినాలని వైద్యులు సలహా ఇస్తారు. వైద్యులు ఇచ్చిన ఈ చిన్న సలహా అధిక రక్తపోటు రోగుల జీవితాన్ని మార్చగలదు. అయితే బీపీ ఉన్నవారికి అరటిపండు ఎందుకు అంత ప్రత్యేకమైనదో? అరటిపండులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది సోడియంను సమతుల్యం చేస్తుంది. రక్తపోటును సహజంగా నియంత్రిస్తుంది. అధిక బీపీకి పొటాషియం సహజ శత్రువు అని వైద్యులు అంటున్నారు. ఒక మధ్య తరహా అరటిపండులో దాదాపు 422ఎమ్జ పొటాషియం ఉంటుంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ ఫిజియాలజీ-రీనల్ ఫిజియాలజీలో ప్రచురితమైన ఒక కొత్త అధ్యయనంలో అధిక పొటాషియం తీసుకోవడం అనుకరణ కాలియురేసిస్, నాట్రియురేసిస్, బీపీని గణనీయంగా తగ్గిస్తుందని కనుగొంది. ఎక్కువ సోడియంతో కూడా ప్రయోజనాలను పొందవచ్చు. రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అది కూడా ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా. అందుకే దీనిని సూపర్ ఫుడ్ అని పిలుస్తారు. బీపీ రోగులకు ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. అరటిపండును ఒక పరిపూర్ణ ఆరోగ్య చిరుతిండిగా పరిగణిస్తారు. అరటిపండు రుచికరమైనది మాత్రమే కాదు తక్కువ కేలరీలు, అధిక పోషకాలు కలిగిన పండు కూడా. మీరు దీన్ని ఉదయం ఎప్పుడైనా తినవచ్చు. స్నాక్స్ సమయంలో లేదా నడక తర్వాత. దీనివల్ల శరీరానికి మంచి శక్తి, పోషకాలు లభిస్తాయి. అరటిపండ్లలో ఉండే విటమిన్ బి6, మెగ్నీషియం రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. ఒత్తిడిని తగ్గించడంలో కూడా సహాయపడతాయి. ప్రతిరోజూ ఒక అరటిపండు తినడం వల్ల మనసు కూడా రిలాక్స్గా ఉంటుంది. దీనివల్ల అనేక సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. అరటిపండులో ఉండే డైటరీ ఫైబర్ రక్తపోటును నియంత్రించడంలో సహాయపడటమే కాకుండా కొలెస్ట్రాల్ను సమతుల్యం చేస్తుంది. ఇది మీ గుండె ఆరోగ్యానికి బూస్టర్గా కూడా పనిచేస్తుంది.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

# భారత్ ధర్మశాల కాదు..

దేశ భద్రతపై అమిత్ షా కీలక వ్యాఖ్యలు..




**మన దునియా,న్యూఢిల్లీ:ఆగస్టు 26**

2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌గా ఎదగాలంటే దేశ అంతర్గత భద్రత మరింత బలోపేతం కావాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు.అక్రమ చొరబా ట్లు, ఉగ్రవాదం, మాదకద్రవ్యాల అక్రమ రవాణాసైబర్ ముప్పులు వంటి సవాళ్లను ముందుగానే గుర్తించి అడ్డుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.ఇంటెలిజెన్స్ బ్యూరో నిర్వహించిన నేషనల్ సెక్యూరిటీ స్ట్రాటజీ కాన్ఫరెన్స్ ముగింపు సమావేశంలో అమిత్ షా పాల్గొన్నారు. ఆ సమావేశంలో అమిత్ షా భవిష్యత్ భద్రతా వ్యూహంపై కీలక సూచనలు చేశారు.వచ్చే 15-20 ఏళ్లలో దేశ భద్రతను ప్రభావితం చేసే పరిణామాలను ఇప్పటి నుంచే అంచనా వేసి వ్యూహాలను రూపొందించాలని భద్రతా, నిఘా సంస్థలను కోరారు. అక్రమ వలసదారుల అంశంపై అమిత్ షా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'ఈ దేశం ధర్మశాల కాదు. ఈ దేశంలో నివసించే హక్కు కేవలం ఈ దేశ పౌరులకు మాత్రమే ఉంటుంది' అని అన్నారు. అక్రమ చొరబాట్లు దేశ భద్రతతో పాటు ఆర్థిక స్థిరత్వం, జనాభా సమతుల్యతకు కూడా ముప్పుగా మారే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. భద్రతా వ్యవస్థలు అక్రమ చొరబాట్లను ముందుగానే గుర్తించి అడ్డుకోవాలని సూచించారు. దేశంలోని భూ సరిహద్దుల భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు కేంద్రం చర్యలు చేపట్టిందని హోంమంత్రి తెలిపారు. గత ఎనిమిది నెలల్లో సరిహద్దుల్లో ఉన్న అన్ని రాష్ట్రాలతో కేంద్రం చర్చలు జరిపిందని, నాలుగు స్తంభాల సరిహద్దు భద్రతా వ్యవస్థను రూపొందించినట్లు చెప్పారు. తక్కువ సమయంలో భారత్‌ను అక్రమ చొరబాట్ల నుంచి విముక్తి చేయడమే లక్ష్యమని అమిత్ షా పేర్కొన్నారు..

# అత్యాచారం కేసులో సుప్రీంకోర్టు షాక్.. 2 వారాల్లో లొంగిపోవాలని తేజ్‌పాల్‌కు ఆదేశం

**మన దునియా,న్యూఢిల్లీ:ఆగస్టు 27**

2013 నాటి అత్యాచారం కేసులో దోషిగా తేలిన మాజీ తెహెల్కా ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. లొంగిపోవడం నుంచి మినహాయింపు కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం తిరస్కరించింది. రెండు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశించింది.తేజ్‌పాల్ పిటిషన్‌పై జస్టిస్ అలోక్ అరాధే నేతృత్వంలోని సింగిల్ జడ్జి బెంచ్ సోమవారం విచారణ పూర్తి చేసి తీర్పును రిజర్వ్ చేసింది. తేజ్‌పాల్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, గోవా ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు.తేజ్‌పాల్ అప్పీల్‌ను విచారణకు స్వీకరించాలంటే ముందుగా ఆయన లొంగిపోయినట్లు ధ్రువీకరించే సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుందని.. లేదంటే లొంగిపోవడం నుంచి మినహాయింపు కోరుతూ ప్రత్యేక పిటిషన్ దాఖలు చేయాలని తుషార్ మెహతా వాదించారు. సుప్రీంకోర్టు రూల్స్, 2013తో పాటు గత తీర్పులను ఆయన ప్రస్తావించారు.అయితే కపిల్ సిబల్ మాత్రం గోవా ప్రభుత్వం ప్రస్తావించిన సుప్రీంకోర్టు నిబంధనలు ఈ కేసుకు వర్తించవని వాదించారు. బాంబే హైకోర్టు ఇప్పటికే తేజ్‌పాల్‌కు నాలుగు వారాల గడువు ఇచ్చిందని, అప్పటివరకు ఆయనకు కోర్టు రక్షణ ఉందని తెలిపారు. ఆగస్టు 31న రెగ్యులర్ బెంచ్ ముందు కేసును విచారణకు లిస్ట్ చేయాలని కోరారు.ఆగస్టు 6న బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ తేజ్‌పాల్ ఆగస్టు 20న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 2021లో గోవా సెషన్స్ కోర్టు ఇచ్చిన నిర్దోషి తీర్పును బాంబే హైకోర్టు కొట్టివేసి.. తేజ్‌పాల్‌ను అత్యాచారం కేసులో దోషిగా తేల్చింది.2013 నవంబర్‌లో గోవాలో తెహెల్కా నిర్వహించిన ఓ కార్యక్రమం సందర్భంగా హోటల్ లిఫ్ట్‌లో తనతో పనిచేసిన జూనియర్ మహిళా ఉద్యోగిపై తేజ్‌పాల్ రెండుసార్లు లైంగిక దాడికి పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి. అదే నెలలో ఆయనను అరెస్టు చేశారు. 2014 జూలైలో బెయిల్ లభించింది. 2017లో విచారణ ప్రారంభం కాగా.. 2021 మేలో గోవా సెషన్స్ కోర్టు ఆయనను నిర్దోషిగా ప్రకటించింది. ఈ తీర్పును గోవా ప్రభుత్వం బాంబే హైకోర్టులో సవాల్ చేసింది. 81 పేజీల తీర్పులో హైకోర్టు ట్రయల్ కోర్టు నిర్ణయాన్ని "వక్రీకృతమైనది"గా అభివర్ణించింది. విచారణ సందర్భంగా ఫిర్యాదుదారురాలిని వ్యవహరించిన తీరుపై కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. లైంగిక దాడికి గురైన మహిళ "పర్ఫెక్ట్ బాధితురాలు"లా వ్యవహరించాల్సిన అవసరం ఉందనే భావనకు ట్రయల్ కోర్టు లోనైందని హైకోర్టు పేర్కొంది. ఆమె వ్యక్తిగత జీవితంపై డిఫెన్స్ చేసిన వాదనలపైనా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.



**తేజ్‌పాల్‌కు 10 ఏళ్ల జైలు శిక్ష**

బాంబే హైకోర్టు భారతీయ శిక్షాస్మృతిలోని పలు సెక్షన్ల కింద తేజ్‌పాల్‌ను దోషిగా తేల్చింది. విశ్వాసం లేదా అధికార స్థితిని ఉపయోగించి అత్యాచారానికి పాల్పడినందుకు సంబంధించిన సెక్షన్ 376(2)(ఎఫ్)తో పాటు లైంగిక వేధింపులు, దుస్తులు విప్పే ఉద్దేశంతో దాడి లేదా క్రిమినల్ ఫోర్స్‌కు సంబంధించిన సెక్షన్లు 354(ఏ), 354(బి) కింద కూడా దోషిగా నిర్ధారించింది. ఆయనకు 10 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 లక్షలకు పైగా జరిమానా విధించింది. తొలుత రెండు వారాల్లో లొంగిపోవాలని ఆదేశించిన హైకోర్టు.. ఆయన న్యాయవాదుల అభ్యర్థన మేరకు ఆ గడువును నాలుగు వారాలకు పొడిగించింది. దీంతో సెప్టెంబర్ మొదటి వారంలో ఆయన లొంగిపోవాల్సి ఉంది. సెక్షన్ 376(2)(ఎఫ్) కింద గరిష్ఠంగా జీవిత ఖైదు విధించే అవకాశం ఉంది.తేజ్‌పాల్‌కు విధించిన శిక్షను జీవిత ఖైదుకు పెంచాలని కోరుతూ గోవా ప్రభుత్వం విడిగా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్ శిక్ష పరిమాణానికి మాత్రమే పరిమితమైంది. అలాగే శిక్షలను ఏకకాలంలో అమలు చేయాలని బాంబే హైకోర్టు ఇచ్చిన ఆదేశాన్ని కూడా ప్రభుత్వం సవాల్ చేసింది. అయితే సంఘటన జరిగి చాలా కాలం గడిచిపోవడం, ఆ తర్వాత ఎలాంటి నేరపూరిత ప్రవర్తనకు పాల్పడినట్లు ఆధారాలు లేకపోవడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు జీవిత ఖైదు విధించేందుకు నిరాకరించింది.శిక్ష ఖరారు చేసే సమయంలో తేజ్‌పాల్ తనకు క్షమాభిక్ష చూపాలని కోరుతూ.. తాను "రాజకీయ బాధితుడిని" అని పేర్కొన్నారు. తాను ఇద్దరు కుమార్తెలకు తండ్రినని కూడా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

# ఎన్నాళ్లీ యూరియా తిప్పలు..!

- **"యాప్ విధానంతో గోసపడుతున్న రైతులు "రెండో విడతలో మొక్కజొన్నకే సరిపోతున్న యూరియా వరి పంటకు ఎలా అని ఆందోళనలో రైతులు - పట్టణాల్లో యాప్ లో కనిపించని విక్రయ కేంద్రాలు "బ్లాక్ మార్కెట్ లోకి పొరుగు రాష్ట్రాల యూరియా ఆరూ.720 ల అధిక ధరతో రూ. వెయ్యి బస్తా విక్రయాలు**

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:**

ఉమ్మడి నిజామాబాద్, మన దునియా స్పెషల్ ప్రత్యేక కథనం. పంటల సాగులో యూరియా వాడకం తప్పడిసరి అయ్యింది. యూరియా వాడకపోతే దిగుబడి రాదనే దిగులు ఉంది. పర్యావరణానికి ముప్పును కలిగించి, భూసారం నాశనం చేస్తున్న యూరియా వాడకం తగ్గిస్తే భవిష్యత్ తరాలకు మంచిది. కానీ దిగుబడి దృష్ట్యా రైతులు యూరియా వాడకం తప్పనిసరి అయ్యింది. యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ప్రభుత్వం తెచ్చిన యాప్ విధానంతో కష్టాలు తీరకపోగా మరింత పెరిగాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సరిపడా యూరియా అందక, వరి నాట్లకు ముందే నారుమడులు ఎండిపోతాయనే ఆందోళన నెలకొంది. వర్షాలు ఈ సీజన్ ను ఆదుకునేలా కురవడంతో పంటల సాగు లక్ష్యానికి చేరింది. ఈ తరుణంలో యూరియా అత్యవసరం అయ్యింది. కానీ సరిపడా దొరకడం లేదు. మూడు విడతల్లో ఇస్తుండగా, ఇప్పుడు రెండో విడతలో యూరియా పంపిణీ చేస్తున్నారు. అయితే ప్రస్తుతం ఇచ్చే యూరియా ఏమాత్రం రైతులకు సరిపోవడం లేదు. గతంలో మాదిరిగానే ఆన్లైన్ లో బుక్ చేసుకుని ఎక్కడో విక్రయ కేంద్రాల నుంచి తెచ్చుకునే కష్టాలు తీరడం లేదు. రైతులు, ప్రతిపక్షాలు ఆందోళన చేసిన యాప్ విధానాన్ని కొనసాగిస్తున్నారు. సరిచేసామని చెప్పిన క్షేత్రస్థాయిలో మాత్రం ఇక్కట్లు తప్పడం లేదు. పట్టణాల్లో యూరియా పరిస్థితి మరీ దారుణంగా ఉంది.

మొక్కజొన్నకే సరిపోతున్న యూరియా..

యూరియా పంపిణీలో అవకతవకలను

బరికట్టేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ను రూపొందించింది. అయితే ఈ యాప్ అట్టర్ ఫ్లాప్ కావడంతో ప్రభుత్వం ఇప్పుడు పంటల నమోదు, సమగ్ర ఎరువుల యాజమాన్య పత్రం పేరుతో యూరియా కార్డు విధానం తెచ్చింది అనే విమర్శలు వస్తున్నాయి. గతంలో సరిపడా యూరియా రైతుల వద్దకు వచ్చేది. ఇప్పుడు ఇస్తున్న యూరియా దీనికి సరిపోవడం లేదు. పంటట సీజన్ కావడంతో ఇప్పుడిస్తున్న యూరియా కేవలం మొక్కజొన్న పంటకు మాత్రమే సరిపోతుంది. ఇక వరి పంటకు ఎలా అనే ఆందోళన రైతులకు పట్టుకుంది. ఎకరానికి ఇచ్చే నాలుగు బస్తాల యూరియా సరిపోవడం లేదని రైతులు మొత్తుకుంటూనే ఉన్నారు. అయినా ప్రభుత్వం తన పని తాను చేసుకుపోతుంది. రాష్ట్ర వ్యాప్తంగా యూరియా సరఫరా నిల్వలు లేకపోవడంతో కొరత ఏర్పడుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో 1.40 లక్షల టన్నుల యూరియా మాత్రమే అందుబాటులో ఉందని, యాప్ ను తిరిగి ప్రారంభిస్తే ఒక్కరోజులోనే స్టాక్ ఖాళీ అవుతుందని అధికారులు చెబుతున్నారు. ఖరీఫ్ 2026 సీజన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం 11.6 లక్షల టన్నుల యూరియా కావాలని కోరగా, కేంద్రం 10 లక్షల టన్నులు మాత్రమే కేటాయించింది. ఏప్రిల్ లో 2 లక్షల టన్నులు రావాల్సి ఉండగా 1.63 లక్షల టన్నులే వచ్చింది, మే నెలలో 2 లక్షల టన్నులకు గాను 48,985 టన్నులు మాత్రమే సరఫరా అయ్యింది. నిజామాబాద్ జిల్లా విషయానికి వస్తే. వానాకాలం 2026 సీజన్ కు జిల్లాకు 75 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. మొక్కజొన్నకే సరిపోతున్న యూరియాతో వరి రైతులకు రందీ అవుతుంది. అయితే ప్రస్తుతం వచ్చిన కొద్దిపాటి స్టాక్ ను మొక్కజొన్న రైతులకే సరిపోతోంది. వరి పంటకు యూరియా వేసే దశ దగ్గరపడుతుండటంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. పట్టణ యాప్లలో కనిపించన విక్రయ కేంద్రాలు...

నిజామాబాద్ జిల్లాలోని పట్టణాల్లో యూరియా దొరకకుండా పోయింది. యాప్ ఓపెన్ చేయగానే విక్రయ

కేంద్రాలు కనిపించాలి. కానీ యాప్ ఓపెన్ అవుతుంది.ఎక్కడ స్టాక్ ఉందో కేంద్రాలు చూపించడం లేదని రైతులు వాపోతున్నారు. యూరియా లేక పంటలను ఎలా కాపాడుకోవాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యధిక మంది రైతులు యాప్ ద్వారానే యూరియా కొనుగోలు చేస్తున్నారని కలెక్టర్ స్వయంగా ప్రకటించారు. కానీ క్షేత్రస్థాయిలో అర్బన్ లోని ప్రైవేట్ డీలర్ల దుకాణాలు యాప్ లో కనిపించడం లేదు. డీలర్లు యాప్ వినియోగానికి సహకరించడం లేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి. రైతులు యాప్ లో బుక్ చేసుకుని దుకాణానికి వెళితే యాప్ నిలిచిపోయింది అని చెప్పి చేతులెత్తేస్తున్నారనే ఫిర్యాదులు అర్మూర్ లో ఎక్కువగా వినిపిస్తున్నాయి.

బ్లాక్ మార్కెట్ లో పొరుగు రాష్ట్రాల యూరియా..

యూరియా బస్తా సబ్సిడీ ధర రూ.266 ఉండగా, బస్తాకు రూ.700 చొప్పున అదనంగా బ్లాక్ లో విక్రయిస్తున్నట్టు చర్చ జరుగుతోంది. పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున యూరియా జిల్లాకు సరఫరా జరుగుతున్నట్లు తెలిసింది. ఒక్కో సంచికి రూ. వెయ్యి దండుకుంటున్నారు. సబ్సిడీ పోను జస్తా ధర రూ. 266 ఉండగా, బ్లాక్ మార్కెట్ లో మాత్రం రూ. వెయ్యి పలుకుతోంది. ఆర్మూర్ డివిజన్ లోని ఓ మండలానికి మహారాష్ట్రా నుంచి లారీలో యూరియా వచ్చినట్లు మాట్లాడుకుంటున్నారు. యాప్ విధానం రావడంతో పొరుగు నుంచి దోపిడి మొదలైంది. యాప్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిలో పిఎసిఎస్ సహకార సంఘాల ద్వారా యూరియా పంపిణీ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

యాప్లో విక్రయ కేంద్రాలు చూపించడం లేదు.. రైతు ధర్పల్లి. దుబ్బాక గ్రామ.కోతి శేఖర్ రెడ్డి గత కొద్ది రోజులుగా యాప్ ఓపెన్ చేసిన విక్రయ కేంద్రాలు చూపించడం లేదు. దీంతో అత్యవసరమైన సమయంలో యూరియా అందడం లేదు. దీనిపై అధికారులకు చెప్పినా ఫలితం లేకుండా పోయింది. పంటలు కీలక దశలో ఉన్నాయి. యూరియా ఇప్పుడు వేయకపోతే దిగుబడి ఏమాత్రం రాదు. పంటల సాగు ఖర్చు కూడా వచ్చే అవకాశం లేదు. యాప్ విధానంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# కొలంబో టెస్టు: ముందే ముగిసిన నాలుగో రోజు ఆట.. విజయానికి చేరువలో టీమిండియా



**కొలంబోలో టీమిండియా-శ్రీలంక రెండో టెస్టు**

**లంకను ఫాలో ఆన్ కు దించిన భారత్**

**నాలుగో రోజు వర్షంతో ముందే ముగిసిన ఆట**

**రెండో ఇన్నింగ్స్ లో శ్రీలంక 229/6**

**ఆతిథ్య జట్టుకు 16 పరుగుల స్వల్ప ఆధిక్యం**

భారత్, శ్రీలంక మధ్య కొలంబో వేదికగా జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్ ఉత్కంఠభరిత దశకు చేరుకుంది. అయితే, కీలకమైన నాలుగో రోజు ఆటలో వర్షం పదేపదే అంతరాయం కలిగించడంతో అంపైర్లు ఆటను ముందుగానే రద్దు చేశారు. ఆట ముగిసే సమయానికి, ఫాలోఆన్ ఆడుతున్న శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 229 పరుగులు చేసింది. ప్రస్తుతం 16 పరుగుల స్వల్ప ఆధిక్యంలో ఉన్నప్పటికీ, మ్యాచ్ పూర్తిగా భారత్ నియంత్రణలో ఉంది.నాలుగో రోజు ఉదయం శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌ను 290 పరుగుల వద్ద ముగించిన భారత్, వెంటనే ఫాలోఆన్ ఇచ్చింది. తొలి ఇన్నింగ్స్‌తో పోలిస్తే రెండో ఇన్నింగ్స్‌లో శ్రీలంక బ్యాటర్లు మెరుగైన ఆటతీరు కనబరిచారు. ముఖ్యంగా, మరోసారి అద్భుతంగా ఆడిన పసిందు సూరియబండార (92), కమిందు మెండిస్ (55) భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. ఈ ఇద్దరూ మూడో వికెట్‌కు కీలకమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పి, శ్రీలంకకు మంచి ఆధిక్యం అందించేలా కనిపించారు. వీరి నిలకడతో శ్రీలంక శిబిరంలో ఆశలు చిగురించాయి.అయితే, దూకుడుగా ఆడే క్రమంలో కమిందు మెండిస్ చేసిన ఒక పొరపాటు మ్యాచ్‌ను మలుపు తిప్పింది. ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్‌లో అనవసర షాట్‌కు ప్రయత్నించి స్క్వేర్ లెగ్ వద్ద గాల్లోకి బంతిని లేపాడు. అక్కడ ఫీల్డింగ్ చేస్తున్న శుభ్‌మన్ గిల్ వెనక్కి పరుగెత్తుతూ అద్భుతమైన క్యాచ్ అందుకోవడంతో శ్రీలంక పతనం ప్రారంభమైంది. ఆ వికెట్ పడిన తర్వాత టీమిండియా పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. కొద్దిసేపటికే, సెంచరీకి చేరువలో ఉన్న సూరియబండారను మానవ్ సుతార్ పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ ధనంజయ డి సిల్వా (23), నిరోషన్ డిక్వెల్లా (6) కూడా ఎక్కువసేపు నిలవలేకపోయారు. వర్షం కారణంగా ఆట నిలిపివేసే సమయానికి, సోనల్ దినుషా (7), కేశర నువంత (3) క్రీజులో ఉన్నారు. మరో 8 ఓవర్లలో కొత్త బంతి అందుబాటులోకి రానుండటం భారత బౌలర్లకు మరింత అనుకూలించే అంశం. ఐదో రోజు వర్షం ముప్పు ఉన్నప్పటికీ, వాతావరణం అనుకూలిస్తే మ్యాచ్ ఫలితం తేలడం ఖాయం. ఈ మ్యాచ్‌లో గెలవాలంటే భారత్ మరో 4 వికెట్లు పడగొట్టి, ఆపై లక్ష్యాన్నిఛేదించాల్సి ఉంటుంది. బౌలర్లలో మానవ్ సుతార్ రెండు వికెట్లు తీయగా, సిరాజ్, ప్రసిద్ధ్, జడేజా, సారాంశ్ జైన్ తలో వికెట్ సాధించారు.

# వరల్డ్ నంబర్ వన్ బౌలర్‌గా స్టార్క్.. రెండోస్థానానికి పడిపోయిన బుమ్రా

**తాజా ర్యాంకులు విడుదల చేసిన ఐసీసీ**

**టెస్ట్ బౌలింగ్‌లో తొలిసారి నెం.1గా నిలిచిన మిచెల్ స్టార్క్**

**బంగ్లాదేశ్‌పై ప్రదర్శనతో స్టార్క్‌కు కెరీర్‌లో తొలిసారి అగ్రస్థానం**

**శ్రీలంక సిరీస్‌కు బుమ్రా దూరం కావడం ర్యాంక్‌పై చూపిన ప్రభావం**

**టెస్ట్ ఆల్-రౌండర్ల జాబితాలో రవీంద్ర జడేజా అగ్రస్థానం పదిలం**




అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) బుధవారం విడుదల చేసిన తాజా టెస్ట్ ర్యాంకింగ్స్‌లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. బౌలింగ్ విభాగంలో భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఆధిపత్యానికి తెరదించుతూ ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ తొలిసారిగా నంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. అదే సమయంలో, భారత వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ బ్యాటింగ్ జాబితాలో ఆరు స్థానాలు ఎగబాకి ఏడో ర్యాంకుకు చేరుకున్నాడు.బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో టెస్టులో మిచెల్ స్టార్క్ కనబరిచిన అద్భుత ప్రదర్శనే అతడికి ఈ అగ్రస్థానాన్ని అందించింది. ఆ మ్యాచ్‌లో మొత్తం 10 వికెట్లు పడగొట్టడం ద్వారా స్టార్క్ రెండు స్థానాలు మెరుగుపరుచుకున్నాడు. దీంతో అప్పటివరకు అగ్రస్థానంలో ఉన్న బుమ్రాతో పాటు న్యూజిలాండ్ బౌలర్ మ్యాట్ హెన్రీని అధిగమించాడు. మరోవైపు, శ్రీలంకతో జరుగుతున్న ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సిరీస్‌కు బుమ్రా దూరంగా ఉండటం అతని ర్యాంకింగ్‌పై ప్రభావం చూపింది. ఈ మార్పులతో బుమ్రా రెండో స్థానానికి, హెన్రీ మూడో స్థానానికి పడిపోయారు. 36 ఏళ్ల స్టార్క్‌కు తన 15 ఏళ్ల సుదీర్ఘ టెస్ట్ కెరీర్‌లో నంబర్ వన్ ర్యాంక్ అందుకోవడం ఇదే మొదటిసారి. ఎక్కువ కాలం టాప్ 10లో ఉన్నప్పటికీ, అగ్రపీఠాన్ని ఎన్నడూ చేరలేదు. బౌలింగ్ జాబితాలో ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ ఒక స్థానం మెరుగుపరుచుకుని నాలుగో ర్యాంకుకు, స్పిన్నర్ నాథన్ లైయన్ రెండు స్థానాలు ఎగబాకి పదో స్థానంలో నిలిచారు. ఇక బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో రిషభ్ పంత్ దూకుడు ప్రదర్శించాడు. గాలెలో శ్రీలంకతో జరిగిన తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో మెరుపు అర్ధశతకం సాధించడంతో ఏకంగా ఆరు స్థానాలు ఎగబాకి సంయుక్తంగా ఏడో ర్యాంకులో నిలిచాడు. బ్యాటింగ్ జాబితాలో తొలి నాలుగు స్థానాల్లో ఎలాంటి మార్పు లేదు. ఇంగ్లండ్ ఆటగాళ్లు హ్యారీ బ్రూక్, జో రూట్ తొలి రెండు స్థానాల్లో కొనసాగుతుండగా, ఆసీస్ బ్యాటర్లు స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్ వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో ఉన్నారు. భారత్ బ్యాటర్ కేఎల్ రాహుల్ కూడా ఐదు స్థానాలు మెరుగుపరుచుకుని 30వ ర్యాంకుకు చేరుకున్నాడు. ఆల్-రౌండర్ల జాబితాలో భారత సీనియర్ ఆటగాడు రవీంద్ర జడేజా తన అగ్రస్థానాన్ని పదిలంగా ఉంచుకున్నాడు. ఇదే జాబితాలో పాట్ కమిన్స్ ఒక స్థానం మెరుగుపరుచుకుని ఏడో స్థానానికి చేరుకున్నాడు.

# ఇలా అయితే 'మళ్లీ అదే తప్పు చేస్తారు'.. జైస్వాల్-ఫెర్నాండో వివాదంపై మంజ్రేకర్ ఫైర్



భారత యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్, శ్రీలంక పేసర్ అసిత ఫెర్నాండో మధ్య జరిగిన వివాదంపై మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ స్పందించారు. ఆటగాళ్ల తప్పిదాలపై తేలికగా వ్యవహరిస్తే.. వారు మళ్లీ అదే ప్రవర్తనకు పాల్పడే అవకాశం ఉందని అన్నారు. ఇలాంటి ఘటనలు ఆటకు, ముఖ్యంగా ఆటగాళ్ల భవిష్యత్తుకు మంచిది కాదని పేర్కొన్నారు.కొలంబోలో జరిగిన రెండో టెస్టులో జైస్వాల్ ఔటైన తర్వాత ఫెర్నాండోతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో జైస్వాల్ హెల్మెట్ ఫెర్నాండో నుదుటికి తగిలింది. ఘటనపై అంతర్జాతీయ క్రికెట్ మండలి ఇద్దరు ఆటగాళ్లకు మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా విధించింది. ఒక్కొక్కరికి ఒక డీమెరిట్ పాయింట్ కూడా ఇచ్చింది.ఈ వ్యవహారంపై మంజ్రేకర్ సోషల్ మీడియాలో స్పందించారు. వైభవ్ సూర్యవంశీ ఘటనను కూడా ప్రస్తావిస్తూ ఐసీసీ, బీసీసీఐను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. ఆటగాళ్లను ఇలాంటి ప్రవర్తన నుంచి తప్పించుకుంటూ పోతే.. అదే పని మళ్లీ చేసేలా ప్రోత్సహించినట్టవుతుందని అన్నారు.ఇటీవల శ్రీలంక 'ఏ'తో మ్యాచ్ సందర్భంగా 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ కూడా వివాదంలో చిక్కుకున్నాడు. శ్రీలంక 'ఏ' ఆటగాడు విషెన్ హలంబగేతో అతడు భౌతిక ఘర్షణకు దిగాడు. అప్పట్లో మంజ్రేకర్ ఈ ఘటనను తీవ్రంగా తప్పుబట్టారు. తాను ఇండియా 'ఏ' మేనేజ్‌మెంట్‌లో ఉంటే తదుపరి మ్యాచ్‌కు వైభవ్‌ను తప్పించేవాడినని చెప్పారు. జైస్వాల్ కూడా తనపై వచ్చిన విమర్శలకు స్పందించాడు. వ్యాఖ్యాత హర్ష భోగ్లే ఈ ఘటనపై ఇన్‌స్టాగ్రామ్‌లో మాట్లాడిన తర్వాత జైస్వాల్ స్పందిస్తూ.. అసలు ఏం జరిగిందో తెలియకుండా తీర్పు ఇవ్వొద్దని కోరాడు. ఎవరైనా హద్దు దాటితే భారత్ పోరాడుతుందని, తగిన సమాధానం ఇస్తుందని వ్యాఖ్యానించాడు.

## అదరగొట్టిన భువీ.. యూపీ లీగ్‌లో లక్నో హవా

యూపీ టీ20 లీగ్ 2026లో లక్నో ఫాల్కన్స్ జోరు కొనసాగుతోంది. భారత సీనియర్ పేసర్, కెప్టెన్ భువనేశ్వర్ కుమార్ తన పదునైన బౌలింగ్‌తో మరోసారి మాయ చేయడంతో డిఫెండింగ్ ఛాంపియన్ కాశీ రుద్రాస్‌పై లక్నో ఫాల్కన్స్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆలస్యంగా ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో లక్నోకు ఇది వరుసగా మూడో గెలుపు కావడం విశేషం. రెండు రోజుల వ్యవధిలో కాశీ జట్టుపై లక్నోకి ఇది రెండో విజయం.లక్నోలోని ఏకానా క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన లక్నో ఫాల్కన్స్ బౌలింగ్ ఎంచుకుంది. కెప్టెన్ భువనేశ్వర్ కుమార్ ఆరంభంలోనే అద్భుత స్పెల్‌తో చెలరేగాడు. పవర్‌ప్లేలోనే మూడు కీలక వికెట్లు పడగొట్టి కాశీ రుద్రాస్ టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. దీంతో కాశీ జట్టు 28 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో శుభమ్ చౌబే (32 బంతుల్లో 46) ఒంటరి పోరాటంతో కాశీ జట్టు కాస్త కోలుకుంది. అయితే, మరో పేసర్ అభినందన్ సింగ్ (3/16) మిడిల్, లోయర్ ఆర్డర్‌ను దెబ్బతీయడంతో కాశీ రుద్రాస్ 19.1 ఓవర్లలో 126 పరుగులకే ఆలౌట్ అయింది. భువనేశ్వర్ 20 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు.127 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నో ఫాల్కన్స్‌కు ఓపెనర్ మహమ్మద్ సైఫ్ (8 బంతుల్లో 17) మంచి ఆరంభాన్ని ఇచ్చాడు. అయితే, కాశీ బౌలర్ సంగమ్ సింగ్ ఒకే ఓవర్లో సైఫ్‌తో పాటు అజీత్ వర్మ (0)ను పెవిలియన్‌కు పంపి షాకిచ్చాడు. ఈ సమయంలో క్రీజులోకి వచ్చిన హిమాన్షు సింగ్ (41 బంతుల్లో 64; 9 ఫోర్లు, 2 సిక్సర్లు) దూకుడైన అర్ధశతకంతో ఛేదనను నడిపించాడు. జట్టు స్కోరు 109 వద్ద అతను ఔటయ్యేసరికే లక్నో విజయం దాదాపు ఖాయమైంది. మధ్యలో కొద్దిసేపు వర్షం ఆటంకం కలిగించినా, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ప్రియమ్ గార్గ్, కీపర్ కార్తికేయ సింగ్ లాంఛనాన్ని పూర్తి చేశారు. లక్నో ఫాల్కన్స్ 24 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. మ్యాచ్ అనంతరం 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్న భువనేశ్వర్ కుమార్ మాట్లాడుతూ, "మేం టోర్నీ మొదలుపెట్టినప్పుడు పాయింట్ల పట్టికలో వెనుకబడి ఉన్నాం. కానీ గత మూడు మ్యాచ్‌లలో అద్భుతంగా ఆడాం. ఇది మాకు చాలా మంచిది, పట్టికలో పైకి వెళ్లేందుకు సాయపడింది," అని అన్నాడు. తన బౌలింగ్ ప్రణాళికపై స్పందిస్తూ, "పిచ్ బాగుంది, కొద్దిగా స్వింగ్ లభించింది. సరైన ఏరియాల్లో బంతులు వేయడమే నా ప్రాథమిక ప్రణాళిక. అదృష్టవశాత్తూ అది ఫలించింది. సాధారణంగా రెండు, మూడు బంతులకు మించి స్వింగ్ లభించదు. కానీ ఈరోజు నాకు బాగా కలిసొచ్చింది. జట్టుగా అద్భుత ప్రదర్శన చేశాం" అని వివరించాడు. తక్కువ లక్ష్యాన్ని ఛేదించేటప్పుడు ఓపెనర్లు దూకుడుగా ఆడటం ఎంతో కీలకమని, హిమాన్షు అద్భుత ఇన్నింగ్స్ ఆడాడని ప్రశంసించాడు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## గర్భంతోనూ జిమ్‌లో సమంత.. ఫొటోలు వైరల్



గర్భధారణ సమయంలో తన ఫిట్‌నెస్ రొటీన్ ఎలా మారిందో నటి సమంత వెల్లడించింది. జిమ్‌లో వర్కౌట్ చేస్తున్న ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పంచుకుంది. ఇన్నాళ్లూ శరీరాన్ని మరింతగా శ్రమ పెట్టేలా శిక్షణ తీసుకున్నానని.. ఇప్పుడు శరీరం చెప్పేది వినడం నేర్చుకుంటున్నానని తెలిపింది.సమంత ఎన్నో ఏళ్లుగా శక్తిని పెంచే వ్యాయామాలు చేస్తున్నట్లు చెప్పింది. గర్భధారణ సమయంలోనూ వ్యాయామం కొనసాగించేందుకు వైద్యుడి అనుమతి తీసుకున్నానని తెలిపింది. తన ట్రైనర్‌కు గర్భధారణ సమయంలో వ్యాయామాలపై ప్రత్యేక శిక్షణ ఉందని వెల్లడించింది. తన శరీరం, గత అనుభవం, గర్భధారణ పరిస్థితికి తగ్గట్టుగా వర్కౌట్స్‌లో మార్పులు చేసినట్లు వివరించింది.ప్రతి ఒక్కరి గర్భధారణ ఒకేలా ఉండదని సమంత చెప్పింది. తన వర్కౌట్స్‌ను ఇతరులు అనుసరించొద్దని సూచించింది. వ్యాయామం చేసే ముందు వైద్యుడిని సంప్రదించాలని.. నిపుణులైన ట్రైనర్ సాయం తీసుకోవాలని కోరింది..తాను పంచుకున్న వీడియోలో ఛాతీకి సంబంధించిన వ్యాయామం చేసింది. అయితే గతంలోలా ఎక్కువ బరువు ఎత్తడంపై కాకుండా.. శరీరం ఇచ్చే సంకేతాలను గమనించడంపైనే ఇప్పుడు దృష్టి పెట్టినట్లు చెప్పింది. కొన్ని రోజులు వ్యాయామాన్ని తగ్గిస్తున్నానని తెలిపింది.కొన్ని రోజులైతే వర్కౌట్ మొత్తం నేలపై పడుకోవడంతోనే పూర్తవుతోందని సమంత సరదాగా వ్యాఖ్యానించింది. ఇన్నేళ్లుగా తన శరీరాన్ని మరింత పని చేయడానికి సిద్ధం చేశానని.. ఇప్పుడు తక్కువ పని చేయమని శరీరం అడిగినప్పుడు దాన్ని గౌరవించడం నేర్చుకుంటున్నానని పేర్కొంది.చిన్న ప్రాణాన్ని మోస్తున్న సమయంలో లక్ష్యాలు కూడా మారిపోతాయని సమంత అభిప్రాయపడింది. తన శరీరం ఇప్పటివరకు చేసిన పనుల్లో ఇదే అత్యంత బలమైన పని కావచ్చని పేర్కొంది. సమంత 2026 జూన్‌లో తన గర్భధారణ విషయాన్ని బహిరంగంగా వెల్లడించింది. భర్త రాజ్ నిడిమోరుతో కలిసి తొలి బిడ్డకు స్వాగతం పలకబోతున్నట్లు ప్రకటించింది.

## గోల్డెన్ గ్లోబ్ అవార్డును పగలగొట్టి అబద్ధం చెప్పా: ఇయాన్ మెక్‌కెల్లెన్

దిగ్గజ నటుడు సర్ ఇయాన్ మెక్‌కెల్లెన్ తన కెరీర్‌లో అందుకున్న ఏకైక గోల్డెన్ గ్లోబ్ అవార్డుకు సంబంధించి తాను చెప్పిన ఒక అబద్ధాన్ని తాజాగా వెల్లడించారు. ప్రమాదవశాత్తు ఆ పురస్కారం మెమొంటో విరిగిపోవడంతో, అది కనిపించడం లేదని నిర్వాహకులకు అబద్ధం చెప్పినట్లు ఆయన అంగీకరించారు. 1997లో "రస్పుటిన్: డార్క్ సర్వెంట్ ఆఫ్ డెస్టినీ" చిత్రంలో అద్భుత నటనకు గానూ మెక్‌కెల్లెన్ ఉత్తమ సహాయ నటుడిగా గోల్డెన్ గ్లోబ్ అవార్డును దక్కించుకున్నారు. త్వరలో ప్రసారం కానున్న 'టీ విత్ జూడీ డెంజ్ ఫీచరింగ్ సర్ ఇయాన్ మెక్‌కెల్లెన్' అనే ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఈ ఆసక్తికర సంఘటనను గుర్తుచేసుకున్నారు. దీనికి సంబంధించిన ఒక వీడియో క్లిప్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది."ఆ గోల్డెన్ గ్లోబ్ ప్రతిమను ఎలా తయారు చేశారో తెలుసుకోవాలనే కుతూహలంతో దాని కింద ఉన్న ఒక స్క్రూను విప్పాను. వెంటనే ఆ పురస్కారం ముక్కలైపోయింది. దాన్ని నేను తిరిగి అమర్చలేకపోయాను. అదే సమయంలో నా పేరును ఆ ప్రతిమపై చెక్కడం కోసం దానిని తిరిగి పంపాలని నిర్వాహకులు కోరారు. దాంతో అది కనిపించడం లేదని వారికి అబద్ధం చెప్పాల్సి వచ్చింది" అని మెక్‌కెల్లన్ వివరించారు. మెక్‌కెల్లెన్ తన సుదీర్ఘ కెరీర్‌లో అందుకున్న ఏకైక గోల్డెన్ గ్లోబ్ పురస్కారం ఇదే కావడం విశేషం. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న మరో ప్రముఖ నటి డేమ్ జూడీ డెంజ్ కూడా తన ఆస్కార్ అవార్డుకు సంబంధించిన ఒక పొరపాటును పంచుకున్నారు. స్కై ఆర్ట్స్ ఛానల్‌లో ఈ కార్యక్రమం త్వరలో ప్రసారం కానుంది.





## యశ్ సినిమాకు కోర్టు రక్షణ.. 'టాక్సిక్'పై నెగెటివ్ ప్రచారానికి బ్రేక్

పాన్ ఇండియా స్టార్ యశ్ కథానాయకుడిగా రూపొందుతున్న 'టాక్సిక్' చిత్రానికి సంబంధించి ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ సినిమాపై సోషల్ మీడియా వేదికగా సాగుతున్న తప్పుడు ప్రచారానికి అడ్డుకట్ట వేస్తూ బెంగళూరు కోర్టు తాత్కాలిక ఇంజంక్షన్ ఉత్తర్వులు జారీ చేసింది.నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన అడిషనల్ సిటీ సివిల్ అండ్ సెషన్స్ కోర్టు ఈ మేరకు ఆదేశాలు వెలువరించింది. సినిమా ప్రతిష్ఠను దెబ్బతీసేలా లేదా కించపరిచేలా ఎలాంటి తప్పుడు వార్తలు, కంటెంట్‌ను ప్రచురించడం, పోస్ట్ చేయడం, స్ట్రీమింగ్ లేదా షేర్ చేయకూడదని కోర్టు స్పష్టం చేసింది. ముఖ్యంగా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'తో పాటు ఇతర మాధ్యమాల్లోనూ ఈ ఆంక్షలు వర్తిస్తాయని పేర్కొంది. ఈ మధ్యంతర ఉత్తర్వులు తదుపరి విచారణ తేదీ అయిన సెప్టెంబర్ 28 వరకు అమల్లో ఉంటాయని కోర్టు వెల్లడించింది. ఈ ఆదేశాలను దుర్వినియోగం చేయరాదని, నిబంధనలు ఉల్లంఘిస్తే ముందస్తు నోటీసు లేకుండానే ఇంజంక్షన్‌ను రద్దు చేస్తామని కోర్టు హెచ్చరించింది. సినిమాపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్న వ్యక్తులకు, సంస్థలకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని స్పష్టం చేసింది.




## ధనుష్ చేతుల మీదుగా జీవీ ప్రకాశ్ 'ఇమ్మోర్టల్' ట్రైలర్.. ఆద్యంతం ఉత్కంఠ!

ప్రముఖ నటుడు, సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్, కయాదు లోహర్ జంటగా నటించిన హారర్ థ్రిల్లర్ 'ఇమ్మోర్టల్'. మరియప్పన్ చిన్న దర్శకత్వం వహించిన ఈ చిత్రం ట్రైలర్‌ను స్టార్ హీరో, నిర్మాత ధనుష్ బుధవారం విడుదల చేశారు. తన ఎక్స్ ఖాతాలో ట్రైలర్‌ను పంచుకుంటూ.. "ఇదిగో 'ఇమ్మోర్టల్' ట్రైలర్.. జీవీ ప్రకాశ్ కు ఆల్ ది బెస్ట్" అని చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.ట్రైలర్‌ను పరిశీలిస్తే, ఇది ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. విదేశీ గిరిజన జంట తమ బిడ్డ కోసం ఎదురుచూసే సన్నివేశంతో ట్రైలర్ ప్రారంభమవుతుంది. ఆ తర్వాత కథ భారతదేశానికి మారుతుంది. ఇక్కడ మహి (జీవీ ప్రకాశ్) షేరింగ్ పద్ధతిలో ఉండటానికి ఒక గది కోసం వెతుకుతుంటాడు. ఆ సమయంలో సింధు (కయాదు లోహర్) నుంచి అతనికి ఫోన్ వస్తుంది. తాను ఒంటరిగా ఉంటున్నానని, రూమ్ మేట్ కోసం చూస్తున్నానని ఆమె చెబుతుంది. అందమైన, ధనవంతురాలైన సింధును చూసి ఇష్టపడిన మహి, వెంటనే ఆమె గదికి మారిపోతాడు. ఆమెతోనే జీవితంలో స్థిరపడాలని నిర్ణయించుకుంటాడు.అయితే, ఆ ఫ్లాట్‌లో అడుగుపెట్టినప్పటి నుంచి మహి జీవితంలో ఊహించని, భయానక సంఘటనలు చోటుచేసుకుంటాయి. ఆ పరిణామాలు అతడిని పిచ్చివాడిని చేస్తాయి. ఆశ్చర్యకరంగా, ఫ్లాట్‌లో ఏం జరుగుతుందో సింధుకు ముందే తెలిసినట్లుగా ట్రైలర్‌లో చూపించడం కథపై ఆసక్తిని మరింత పెంచుతోంది.ఇప్పటికే ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు ఎలాంటి కోతలు లేకుండా 'ఖ' సర్టిఫికెట్ జారీ చేసింది. సెప్టెంబర్ 4న ఈ సినిమాను థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. వాస్తవానికి ఈ ఏడాది మే నెలలోనే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని అప్పుడే విడుదల చేయాలని భావించినా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. గతేడాది విడుదలైన టీజర్ సైతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో టీఎమ్ కార్తీక్, కుమార్ నటరాజన్, లొల్లు సభ మారన్, ఆదిత్య కతిర్, అర్షు మహర్జన్ వంటి వారు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అరుణ్‌కుమార్ ధనశేఖరన్ నిర్మించిన ఈ చిత్రానికి అరుణ్ రాధాకృష్ణన్ సినిమాటోగ్రఫీ అందించగా, సామ్ సీఎస్ సంగీతం సమకూర్చారు. శాన్ లోకేశ్ ఎడిటర్‌గా, శివ శంకర్ ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cell No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com